

టెన్‌షన్ తీరింది!

ముగిసిన పది పరీక్షలు..3 నుంచి మూల్యాంకనం

చివరి రోజు 406 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల టెన్‌షన్ తీరింది.. ఎప్పుడెప్పుడు పరీక్షలు ముగుస్తాయా అని విద్యార్థులు చూశారు.మంగళవారంతో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పదవ తరగతి పరీక్షలు ఈనెల 17న ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచి మొత్తం 25,723 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు సిద్ధమయ్యారు. అందులో 24,763 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 960 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నట్టు డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. మంగళవారం చివర పరీక్షగా జరిగిన సోషల్ పరీక్షకు 23,440 మంది హాజరు కాగా 406 మంది గైర్హాజరయ్యారు.కారణాలేంటో కానీ ఈ సారి ప్రతి పరీక్షకు వందల సంఖ్యలో విద్యార్థులు గైర్హాజరవడం కనిపించింది.తొలిరోజు నుంచి ఆ లెక్క ఇలా ఉంది. తెలుగు పరీక్షకు 461 మంది, హిందీకి 377 మంది, ఇంగ్లీష్‌కు 385 మంది, సంస్కృతం పరీక్షకు 45 మంది, లెక్కల పరీక్షకు 466 మంది, పీఎస్‌కు 461 మంది, ఎన్‌ఎస్‌కు 421 మంది, సోషల్ పరీక్షకు 406 మంది గైర్హాజరవడం గమనార్హం.ఈ నెల 3వ తేదీ నుంచి పరీక్ష పేపర్ల మూల్యాంకనం జరగనుంది.

పింఛన్ల పంపిణీలో ఆరో స్థానం

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు మంగళవారం 95.67 శాతం పంపిణీ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిం ఛన్లు పంపిణీ చేశారు.వేరే ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉండిపోవడం తదితర కారణాల వల్ల మిగతావారికి పంపిణీ చేయలేకపో యి నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం పింఛన్ల సంఖ్య 2,35,076గా ఉంది. అందులో తొలిరోజు 2,24,891 మందికి పింఛన్ల సొమ్ము అందజేశారు. మొత్తం జిల్లాకు రూ.102,28,25,500 అందులో కోట్ల పింఛన్ల సొమ్ము విడుదల కాగా రూ.97, 63,87,000 పంపిణీ చేశారు.తొలి రోజు పింఛన్ల పంపిణీలో జిల్లాకు 6వ స్థానం లభించింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్వ యంగా లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పలు నియో జకవర్గాల్లో ఎమ్మెల్యేలు పంపిణీ చేయడం గమనార్హం.



పెరవలి మండలం ముక్కామలలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

భానుడికే..గొడుగు!

సాధారణంగా గొడుగు ఎప్పుడు వాడతాం.. వర్షం పడితే.. ప్రస్తుతం వర్షాకాలం కాకపోయినా గొడుగులకు డిమాండ్ వచ్చింది.. భానుడు మండిపడుతుండడంతో గొడుగుల వినియోగం పెరిగింది..ఈ చిత్రంలోనే చూడండి.. రాజమహేంద్రవరంలో మంగళవారం మధ్యాహ్నం ఒక జంట గొడుగు నీడన భానుడికి చిక్కకుండా ఎలా వెళుతున్నారో.. ఐడియా బాగుంది కదూ మనమూ ఒక గొడుగు కొనేద్దాం ఇక పదండి మరి..!

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





పెరవలి మండలం ముక్కామలలో నీటితొట్టెల నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి దుర్గేష్

157 నీటితొట్టెల నిర్మాణం


- ఉపాధి హామీ పథకంలో పనులు
- 15 మండలాల్లో ఏర్పాటు
- పశువుల దాహార్తి తీర్చడమే లక్ష్యం
- మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 157 నీటి తొట్టెల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద వేసవి కాలంలో పశువులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదించినట్టు చెప్పారు. పశువుల తాగునీటి అవసరాలకు చేపట్టిన తొట్టెలకు నీటి కనెక్షన్ సంబంధిత గ్రామ పంచాయతీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వెటర్నరి విభాగం పశువైద్య శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా 157 గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మండలాలు వారీగా చాగల్లు 10, దేవరపల్లి 10, గోపాలపురం 4, కొవ్వూరు 8, నల్లజర్ల 5, రాజానగరం 44, రంగంపేట 15, పెరవలి 18, తాళ్ళపూడి 5, నిడదవోలు 23, ఉండ్రాజవరం 15 చొప్పున నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం. నాగ మల్లేశ్వరరావు, పీడీ ఆర్డీఏ ఎన్‌వీవీ ఎనహార్తి, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు సమరవంతంగా అమలు చేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులపై మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాం తి, జేసీ ఎస్.చిన్నరాముడు, అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతి నివేదికలు కూడా అందజేయాలన్నారు. నిడదవోలులో ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నిడదవోలులో సమస్యలేమైనా ఉంటే అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఎర్రకాలువ పనుల పరిస్థితిపై కూడా చర్చించా రు. రానున్న సమావేశం నాటికి వివిధ శాఖలు నిర్దేశించుకున్న లక్ష్యాలతో నియోజకవర్గ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

ఫార్మసిస్ట్ నాగాంజలి పరిస్థితి విషమం | 4న అమరావతి చిత్రకళా ప్రదర్శన 7



వెలుగుబంద కాలనీలో చక..చకా సాగుతున్న ఇళ్ల నిర్మాణం

గృహమస్తు!

సిద్ధమవుతున్న ఎన్‌టీఆర్ నగర్‌లు..

- ఇళ్ల నిర్మాణాల్లో కదలిక
- వేగంగా సాగుతున్న నిర్మాణపనులు
- ఫలించిన ప్రభుత్వ ప్రయోగం
- కదులుతున్న పేద జనం
- వెలుగుబందలో 3096 ఇళ్లు లక్ష్యం
- మే నెలాఖరుకు పూర్తిచేసే యోచన
- మరో 3 కాలనీల్లో ఆరంభమే లేదు
- ఇళ్లు మొదలైతే పాత విధానమే
- ఆరంభంకాకపోతే రెండు సెంట్లు
- పేదింటికి అధనంగా నిధులు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటికలను నెరవేర్చడానికి పనులు వేగవంతమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా కాలనీల అభివృద్ధి మాత్రం చేపట్టలేదు. జగన్ ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నానని చెప్పి ఏ కాలనీలోనూ కనీసం వంద ఇళ్లను నిర్మించలేకపోవడంతో ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఆ బాధ్యత తీసుకున్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత పేదలకు ఇచ్చిన ఒక్కో హామీని నెరవేరుస్తున్న సంగతి తెలిసిందే.దీనిలో భాగంగా పేదల కాలనీలకు ఎన్టీఆర్ కాలనీలు అని నామకరణం చేస్తూ ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. కానీ ఎక్కడా ఇంకా అధికారులు ఎన్టీఆర్ కాలనీ అని పేరు పెట్టకపోవడం గమనార్హం.

వెలుగుబందలో..

రాజానగరం మండలం వెలుగుబంద ఎన్టీఆర్ నగర్‌లో రాజమహేంద్రవరం పేదల కోసం 10,993 పట్టాలు ఇచ్చారు. 9,874 ఇళ్లను మంజూరు చేశారు. అందులో సుమారు 200 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. వంద ఇళ్లలో కాపురం ఉంటున్నారు. అనేక కారణాల వల్ల కొందరు పునాదులు వేయలేదు. మరికొందరు పునాదుల్లో నిలిపివేశారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మే నెల చివరకు ఈ నగర్‌లో 3096 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో కలెక్టర్ ప్రశాంతి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే 1882 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. అర్బన్ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతున్నారు. రోజుకు 19 ఇళ్లను నిర్మించాలనే లక్ష్యం పెట్టారు.ఇంకా 1214 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. కొందరు లబ్ధిదారులు మాత్రం బోర్లలో నీరు ఇంకిపోయిందని.. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీళ్లు అందక పనులకు ఆటంకం వస్తుందని చెబుతున్నారు. అధికారులు మాత్రం పనులు పూర్తి చేస్తా మంటున్నారు. సైట్‌లో ఉండి, ఇళ్ల నిర్మాణ లక్ష్యాలకు పనిచేస్తున్నామని హౌసింగ్ డీఈ కె.సూరిబాబు, ఏఈ కె.ఉమాశంకర్ తెలిపారు.

కానవరంలో కష్టాలు

రాజానగరం మండలం కానవరంలో గతంలో 1045 మందికి పట్టాలిచ్చారు. కానీ 808 ఇళ్లు మంజూరు చేశారు. ఇది రాజమహేంద్రవరానికి 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. పరిజెల్లపేటకు సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటుంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. విద్యుత్ సౌకర్యం లేదు. స్థంభాలు లేవు. నీటి సౌకర్యమూ లేదు. 102 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా 52 పూర్తి చేశారు.ఇక్కడ సౌకర్యాల్లేకపోవడంతో ఇప్పటి వరకూ అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

పల్లకడియంలో

గత సార్వత్రిక ఎన్నికల ముందు రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన 12,269 మందికి సెంటు చొప్పున హడావుడిగా వైసీపీ పట్టాలు పంపిణీ చేసింది.కానీ స్థలం చూపించ లేదు. లబ్ధిదారులు పల్లకడియం వెళ్లి ఆరా తీస్తే అవిగో ఆ పొలాల్లో స్థలాలకే మీకు పట్టలిచ్చారని చెప్పడంతో అందరూ ఉసూరుమంటూ తిరిగొ చ్చేస్తున్నారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం వీరి కష్టాలపై కూడా ఆరా తీసింది. వీరందరికీ అక్కడ సేకరించిన పొలాల్లో రెండేసి సెంట్ల వంతున పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది.ఈ మేరకు మునిసిపల్, హౌసింగ్, రెవెన్యూ అధికారులు పర్యటించారు. త్వరలో లేఅవుట్లు వేసి రెండేసి సెంట్ల వంతున విభజించి ఇళ్లను నిర్మించే యోచనలో ఉన్నారు.

వీరికే రెండేసి సెంట్లు

రాజమహేంద్రవరం అర్బన్ వెలుగుబంద కాలనీలో కొన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టడం వల్ల అక్కడ పాత పద్ధతిలోనే నిర్మాణాలు ఉంటాయి. కానీ అదనంగా ప్రభుత్వం రూ.75 వేల వరకూ సహా యం చేస్తోంది.కానవరం, పల్ల కడియం, బూరుగుపూడి, కాపవరం ప్రాంతాల్లో స్థలాలు చూపిం చకపోయినా పట్టాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రెండేసి సెంట్ల వం తున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించనుంది.

పేదింటికి అధనంగా..

స్థలం ఉన్నా ఇళ్లు కట్టుకోలేమని చెప్పిన వారికి అదనంగా కొంత డబ్బు ఇచ్చి ఇళ్లను నిర్మిస్తోంది. యూనిట్ ఖరీదు గతంలో రూ.1.8 లక్షలు మాత్రమే. ఇవా ళ మరో రూ.50 వేలు అదనంగా ఇస్తోంది. అంటేయూనిట్ ఖరీదు రూ. 2.3లక్షలు అయింది. దీంతో కొందరు ముందుకు వస్తున్నారు. ప్రభు త్వం ఎంత ఇబ్బంది ఉన్నా ఇక్కడ పేదలకు ఇళ్ల ను నిర్మించాలనే లక్ష్యంతో ఉంది. దానికి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి కృషి తోడవుతోంది.

ఆవ..అంతేనా?

బూరుగుపూడి, కాపవరం ఆవలో గత ప్రభుత్వం 12,269 మందికి పట్టాలు ఇచ్చింది. కానీ స్థలాలు చూపించలేదు. కానీ ఆవలోనే లేఅవుట్ వేసినట్టు చెప్పింది. ఇది వర్షాకాలంలో బాగా లోయలా మారుతుండడంతో ప్రజలు, రాజకీ య నేతల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో కోర్టును ఆశ్రయించారు.ఇక్కడ పట్టాలపై కొత్త ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.ఆవలో మాత్రం ఇళ్లను నిర్మించదు.వేరే ప్రాంతాల్లో భూమి సేకరించి లబ్ధిదారుడికి రెండేసి సెంట్ల వంతున కేటాయించి,ఇళ్లు నిర్మించే నిర్ణయంతీసుకోవచ్చు.

ఆ కాలనీలకు వెళ్లలేం!

నాడు వైసీపీ ప్రభుత్వం ఊరికి దూరంగా శివారు ప్రాంతంలో స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇంటి నిర్మాణానికే ముందుకు రాలేదు. రాజమహేంద్రవరం నుంచి వెలుగుబంద కాలనీకి 18 కిలోమీటర్ల దూరం ఉంది. కానవరం అయితే 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాదాపుగా మిగిలిన కాలనీలది అదే పరిస్థితి.పేదలకు కాలనీ వద్దకు వచ్చి వెళ్లాలంటే కష్టమే. ఆటో కట్టించుకుంటే రూ.500 నుంచి రూ.800 డిమాండ్ చేస్తారు. వెలుగుబంద కాలనీకి అయితే దివాన్‌చెరువు సెంటర్ నుంచి డ్రాపింగ్‌కే రూ.150 తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో నలుగురో ఐదుగురో కలిసి ఆటో కట్టించుకుని వస్తున్నారు.ఈ ప్రాంతానికి ఓ ఆర్టీసీ బస్సు వేయాలని ప్రజలు కోరుతున్నారు. మంచినీటి కోసం ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేశారు. రెండు పూర్తయ్యాయి. మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. వాటికి వాటర్ కనెక్షన్ ఇవ్వవలసి ఉంది.అప్రోచ్ రోడ్డు వేశారు. విద్యుత్ సబ్-స్టేషన్ ఉంది. అన్ని వీధులకు విద్యుత్ ఉంది. కానీ డ్రైనేజీ లేదు.



ప..రేషన్!

నాలుగేళ్లుగా రేషన్‌కార్డులకు తప్పని నిరీక్షణ

కొత్త రేషన్‌కార్డులకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ ఆరంభిస్తుందా.. ఎప్పుడు దరఖాస్తు చేసుకుందామా అని నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభించ కపోవడంతో నిరాశ చెందారు. తొలుత సంక్రాంతికి కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త కార్డులు జారీ చేస్తే ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. మంత్రి నాదెండ్ల మేలో కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

- వైసీపీలో మూడేళ్లూ ఆ ఊసేలేదు
- ప్రస్తుత ప్రభుత్వంలోనూ జాప్యం
- అర్హులైన పేదల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో కార్డులకు క్యూ
- మే నెలలో ఇచ్చేందుకు ప్రణాళిక
- ఇప్పటికే 16.20 లక్షలు
- మరో 3 లక్షల దరఖాస్తులు
- తాజాగా కార్డులకు ఈకేవైసీ
- నెలాఖరు వరకూ గడువు పెంపు

సామర్లకోట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదు. నాడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి రెండేళ్ల రేషన్‌కార్డుల పేరిట బియ్యం కార్డులు మంజూరు చేసింది. తర్వాత మూడేళ్లలో ఒక్క కార్డూ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న చాలామంది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేశారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కొత్తకార్డులు ఇస్తామని గత డిసెంబరులో ప్రకటించారు. డిసెంబరు 2వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత అది పురోగతి లేకుండా పోయింది.

ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కొత్తకార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు సమర్పిస్తున్నారు. మూడేళ్లగా రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇప్పుడు అనేక మంది అటు తహశీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిగా ఉన్నవారు కొత్తకార్డుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయాన్ని జిల్లా అధికారులు ప్రస్తావించారు.

బోగస్ ఏరివేతకే.. ఈకేవైసీ

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6,43,874 కార్డులు, కోనసీమ అంబేడ్కర్ జిల్లాలో 5,37,902 కార్డులు, తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 కార్డులు ఉన్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే నమోదు చేసుకున్న దరఖాస్తుల గణాంక సమాచారం ద్వారా తెలుస్తోంది. రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుంది. అందుకు ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీని చేపట్టింది. దీనివల్ల రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డు కలిగిన కుటుంబంలో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండడంతో అటువంటి వారి వేలిముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరితో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకున్నారు. నెలల తరబడి ఈ-పోస్‌లో వేలిముద్రలు వేయని వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. అధిక శాతం ఈకేవైసీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకూ పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.



మే నెల నుంచి కొత్తకార్డులు?

ఏటీఎం తరహాలో.. మంత్రి ప్రకటన..

ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్ షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ చేశారు. గ్రామాల్లో ఒక్కొక్క చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మునిసిపాలిటీల పరిధిలో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించారు. కానీ దీనిపై డీలర్లు కోర్టును ఆశ్రయించి తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలిపారు. దీంతో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డుల విభజన చేపట్టాలని న్యాయ స్థానం సూచించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త కార్డుల జారీ మొదలుకానుందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుత రేషన్‌కార్డు సైజు తగ్గించి ఏటీఎం కార్డు తరహాలో మే నెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని, క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు ఇస్తామన్నారు. అయితే కొత్త కార్డులు ఈసారైనా ఇస్తారో లేదో చూడాలి.

కొవ్వూరులో అద్వితీయం

పన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం

91.6 శాతం వసూలు

రాజమండ్రి రీజియన్‌లో ప్రథమం

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల వసూళ్లలో కొవ్వూరు మునిసిపాలిటీ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. కొవ్వూరు మునిసిపాలిటీలో ఇంటి పన్నులకు సంబంధించి డిమాండ్ రూ.3.60 కోట్లకు రూ. 3.30 కోట్లు వసూలు చేసి 91.60 శాతంతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.ఖాళీస్థలాల పన్నుల వసూళ్లలో డిమాండ్ 0.63 లక్షలకు రూ.25 లక్షలు, కుళాయి పన్నులకు సంబంధించి రూ. 133.92 లక్షలకు రూ.54.64 లక్షలు వసూలు చేశారన్నారు. ఆస్తి పన్నులకు సంబంధించి ఎరియర్ రూ.50 లక్షలు బకాయి ఉండగా రూ.40 లక్షలు వసూలు చేశామన్నారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు బకాయిలు చెల్లించని వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిడదవోలులో 5.92 కోట్లు వసూలు

నిడదవోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఇళ్లు, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు రూ.5,92,23,760లు వసూలైనట్టు నిడదవోలు మునిసిపల్ కమి షనర్ టి.కృష్ణవేణి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.4,61,11,332లు వసూలు కాగా ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్స రానికి రూ.5,92,23,760 వసూలు చేశామన్నారు. గతేడాదికంటే రూ.1,31,12,428లు అదనంగా పన్నులు వసూలు చేశామన్నారు. పట్టణంలోని పటిక ఫ్యాక్టరీ రూ.68 లక్షలు, నందిన స్టీల్స్ రూ.8 లక్షలు, నీటి పారుదల శాఖలకు చెందిన ప్రాపర్టీకి సంబంధించి రూ.65 లక్షలు, పోస్టాఫీసుకు సంబంధించి రూ.8 లక్షలు గత ఆరేళ్లగా బకాయిలు ఉన్నట్టు తెలిపారు.



దివాన్‌చెరువు హైవే పక్కన ఇల్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఫ్లయ్ ఓవర్‌కు రూట్ క్లియర్!


దివాన్‌చెరువు వద్ద నిర్మించనున్న ఫ్లయ్ ఓవర్‌కు హైవే అధికారులు రూట్ క్లియర్ చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దివాన్‌చెరువు జాతీయ రహదారి పక్కన ఉన్న పలు భవనాలు నేలమట్టం చేశారు. యజమానులకు ఆరేళ్లకిందటే పరిహారం అందజేసినట్టు సమాచారం.



హడావుడిగా కిరాణా దుకాణం సర్దేస్తున్న వ్యాపారి


శిక్షణ పొందుతున్న బాలుడు

ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి... తర్వాత మగధీరలో రామ్‌చరణ్..... బాహుబలిలో ప్రభాస్... వారిలా గుర్రపుస్వారీ చేయాలనే ఆసక్తి యువతలో పెరుగుతోంది. హార్స్ రైడింగ్ ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది. యువతతో పాటు చిన్న పిల్లలు కూడా నేర్చుకునేందుకు శ్రద్ధ కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. వారు గుర్రాలపై స్వారీ చేస్తుంటే చూసి ముచ్చట పడుతున్నారు. యువత, చిన్నారుల తల్లిదండ్రులకు అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి.


గుర్రపు స్వారీ చేస్తున్న యువకుడు

రి హార్స్ ల్స్

- గుర్రపు స్వారీపై ఆసక్తి కనబరుస్తున్న జనం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెరుగుతున్న శిక్షణ కేంద్రాలు
- కాకినాడ బీచ్‌లో దౌడు తీస్తున్న యువకులు, చిన్నారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు వందకు పైగా గుర్రాలను పెంచుతున్నారంటే గుర్రపు స్వారీ పట్ల యువత ఆసక్తి ఎంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాలు వెలిశాయి. గతంలో గుర్రపు స్వారీ నేర్చుకోవాలంటే పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఓ మోస్తరు పట్టణాల్లో సైతం శిక్షణ కేంద్రాలు తెరుస్తున్నారు. వేసవి కావడంతో యువతతో పాటు చిన్నారులు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాదు కార్పొరేట్ స్థాయి ప్రైవేటు స్కూళ్లల్లో సైతం గుర్రపు స్వారీ శిక్షణ ఇప్పిస్తుండడం విశేషం..

ఎన్నో ప్రయోజనాలు...

గుర్రపు స్వారీ నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక సమస్యల నుంచి గట్టెక్కవచ్చు. పోలియో, పక్షవాతంతో పాటు, మెదడు, వెన్నెముక సమస్యలు, వినికిడి లోపాలు... ఇలా అనేక సమస్యలకు చక్కటి చికిత్సగా పని చేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన పిల్లలకు మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెప్తున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, గుర్రాన్ని దుమికించడం, ఒకే రీతిలో ముందుకు సాగడం వంటి చర్యల వల్ల మెదడుకు, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుంది. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయని చెప్తున్నారు.

ఇసుక నేలైతేనే మేలు...

గుర్రపు స్వారీ ఓ సాహస క్రీడ. ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. అందుకే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గట్టినేలపై ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉండడంతో.. శిక్షకులు ఇసుక నేలల్లో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు అనుకూలంగా ఉండడంతో ఇక్కడే చాలా మంది తమ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులోని ఇసుక మేటల మధ్య కొందరు యువకులు గుర్రపు స్వారీ శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున నేర్పుతున్నారు. అయితే మూడు నెలల పాటు శిక్షణకు వస్తే.. గుర్రపు స్వారీపై కాస్త పట్టు సాధించవచ్చని చెప్తున్నారు.


స్వారీకి గుర్రాన్ని సిద్ధం చేస్తున్న శిక్షకులు





అశ్వమిత్ర... అనిల్ రెడ్డి


ఖరీదైన అశ్వంతో అనిల్ రెడ్డి



కాకినాడ విద్యుత్ నగర్‌కు చెందిన అనిల్ రెడ్డి జంతు ప్రేమికుడు. పలు జాతుల కుక్కలు, గర్రాలను పెంచి పోషిస్తుంటారు. హార్స్ రైడింగ్‌లో కూడా ఈయన నేర్పరి. ఈయన సుమారు పది వరకు మార్వాడీ జాతి గుర్రాలను పెంచుతున్నారు. అందులో ఏడింటిని వ్యక్తిగత అభిరుచి మేరకు పెంచుకుంటుండగా, మూడింటిని శిక్షణకు వినియోగిస్తున్నారు. ఆయన వద్ద రూ.లక్షన్నర మొదలు రూ.కోటి వరకు విలువైన గుర్రాలు వున్నాయి. వీటిని రాజస్థాన్, పంజాబ్ నుంచి తీసుకొచ్చారు. రెండేళ్లుగా ఇక్కడ శిక్షకులను, గుర్రాల సంరక్షకులను ఉంచి, గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈయన పెంచుతున్న గుర్రాలు రెండుసార్లు ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ సాధించాయి.





నేటి సమాజంలో అనేక మంది పిల్లలు ఆటిజం సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశం లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరు ఆటిజంతో బాధపడుతున్నారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివింట్ ఆటిజం (సీడీసీ) నివేదికలు చెప్తున్నాయి. ఆటిజంపై అవగాహన లేని తల్లిదండ్రులు కొందరు ఉండగా, పిల్లలకు దానిని పెద్ద జబ్బుగా భావించే తల్లిదండ్రులు మరికొందరు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నారు.

ఆటిజం... అధిగమిద్దాం



- ఈ లక్షణాలున్న పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి
- నేడు ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా...

రాయవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుంది. పిల్లల మానసిక ఎదుగుదల సరిగ్గా జరగక సాధారణ జీవితం గడపడం కష్టమవుతుంది. మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్ర ఉద్వేగాలకు లోనుకావడంతో పాటు ఇన్ఫెక్షన్‌లకు గురవుతారు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు అందులో స్రవించే సెరటోనిక్, డోపమిన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోవడం, నెలలు నిండకుండా శిశువు పుడితే కూడా ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవడం, తల్లిదండ్రులు పిల్లలతో గడపకపోవడం కూడా ఆటిజం సమస్యకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.



లక్షణాలు: సాధారణంగా శిశువులు ఏడాది వయసులో పాకడం, నవ్వడం, నడవడం, ముద్దుముద్దుగా మాట్లాడడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పిలుపునకు బదుల్విడం వంటివి చేస్తుంటారు. ఆటిజం సమస్య వున్న పిల్లల్లో ఈ లక్షణాలు కనిపించవు. వయసుకు తగ్గట్టుగా మానసిక పరిపక్వత లేకపోవడం, ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, మాట్లాడలేక పోవడం, ఇతరులతో కలవడానికి ఇష్టపడకపోవడం, చేసిన పనులనే మళ్లీమళ్లీ చేస్తుండడం, ఎలాంటి అనుభూతి తెలపకపోవడం, శరీరంపై గాయాలైనా తెలుసుకోలేకపోవడం, శబ్ధాలను పట్టించుకోకపోవడం, సరిగా మాట్లాడలేకపోవడం (లేదా) కారణం లేకుండా ఏడవడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలను కలిగి ఉంటారు.

అధిగమించే మార్గాలు: పిల్లల్లో ఆటిజం సమస్యను అధిగమించేందుకు తల్లిదండ్రులు అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కడుపులో బిడ్డ ఎదుగుదలను వైద్యుల ద్వారా తెలుసుకోవడం, గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, వ్యాయామాలు చేయడం, మనోల్లాసంగా ఉండడంతో పాటు తల్లులు నిర్దిష్టమైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవడం వల్ల ఆటిజం ప్రమాదాన్ని నివారించవచ్చు. గర్భిణులు కొన్ని రకాలైన రోగాలను నియంత్రించేందుకు టీకాలు సైతం తీసుకోవాలి. శిశువు కదలికలకు సంబంధించిన ఏమైనా అనుమానిత లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం ఉత్తమం. ఒకవేళ ఆటిజం బయటపడితే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటూ మరిన్ని జాగ్రత్తలు పాటించి పిల్లలను కాపాడుకోవచ్చు.

తొందరగా గుర్తిస్తేనే నివారణ సాధ్యం



చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదల లోపంతో ఆటిజం వస్తుంది. వీరిలో చాలా మందికి తెలివితేటలు పూర్తిగా లేకపోవడం, పరస్పర సంభాషణలు సరిగ్గా లేకపోవడం, చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పకపోవడం, భావాలను వ్యక్తం చేయలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తాత, అమ్మ, నాన్న వంటి పదాలను పలికిన కొన్ని రోజులకు పలకడం మానేయడం, వాళ్లలో వాళ్లు ఆడుకోవడం, పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అనుమానించి డాక్టర్‌ను సంప్రదించాలి. పిల్లలు చేసిన పనులు మళ్లీ మళ్లీ చేయడం, ఒకే రకమైన వస్తువులు కావాలని కోరుకోవడం, అధిక కోపం, పిల్లలు వారిని వారు కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యుల ను సంప్రదించాలి. చాలా మందిలో అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఆటిజం కి తేడా తెలుసుకోలేరు. ఏడీహెచ్‌డీ, ఆటిజం ఒకటి కాదు అని తల్లిదండ్రులు గుర్తించాలి. ఏడీహెచ్‌డీకి మందులు ఉన్నా ఆటిజంకు లేవు. ఆరు, ఏడు సంవత్సరాలు వచ్చే వరకు పట్టించుకోకుండా వదిలేస్తే పిల్లల్లో ఆటిజం నివారణ సాధ్యం కాదు. ఎంత తొందరగా గుర్తించి సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్లి థెరపీ ఇప్పిస్తే అంత మంచిది.

డాక్టర్ వానపల్లి వరప్రసాద్, సైకియాట్రిస్టు, కాకినాడ

అట్టహాసంగా ముగిసిన నాటిక పోటీలు

- మూడోరోజు మూడు నాటికల ప్రదర్శన

రావులపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 25వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం అట్టహసంగా ముగిశాయి. మూడోరోజు నాటిక పోటీలను శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, పలివెల త్రిమూర్తులు, హాస్యనటుడు గౌతమ్‌రాజులు ప్రారంభించారు. మూడో రోజు సహృదయ ద్రాణాదుల బాపట్ల వారి వర్క్‌ఫం హోం ఈనాటికకు దర్శకత్వం డి.మహేంద్ర, నాటకీరణ అద్దెపల్లి భరత్‌కుమార్, రెండో నాటికగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు ఈ నాటికకు దర్శకత్వం గోకరాజు విజయ్, రచన పీటీ మాధవ్ వ్యవహరించారు. ప్రత్యేక ప్రదర్శనగా సీఆర్సీ రావులపాలెం వారి అలా ఎలా నాటికను ప్రదర్శించా రు. ఈ నాటికకు కథ రచన డా.విక్టరీ వెంకటరెడ్డి, దర్శకత్వం నాటకీకరణ గంటా రామమోహనరావులు వ్యవహరించారు. రావులపాలెం సీఆర్సీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన నాటికపోటీలు ప్రేక్షకులను ఆద్యంతం ఆలోచింప చేశాయి. నాటకరంగ కళాకారుల హావభావాలు పాత్రలకు అనుగుణంగా జీవించి నటించడంతో ప్రేక్షకులు నాటిక ప్రారంభ సమయంనుంచి ముగిసేవరకు ఆశక్తిగాతిలకించారు.

వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ...

వర్క్ ఫ్రమ్ హోం ప్రవేశపెట్టిన తరువాత వంటరాని మొగుడుతో భార్య అన్ని పనులు చేయిస్తుంది. భర్త ఎదురు తిరిగిన సమయంలో నేను నా పుట్టింటికి వెళ్లిపోతానని బెదిరించి కాలక్షేపం చేస్తుంది. వంటరాని భర్తలను ఇబ్బందులు పె ట్టడం ఫేస్‌బుక్ స్నేహాలవల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ఈనాటిక సాగింది.

జనరల్ బోగీ నాటిక సారాంశం

ఓడలలోను, విమానాలలోను ప్రయాణం చేయని వారు ఉండవచ్చు ఏమోకానీ రైలులో ప్రయాణం చేయనివారు ఉండరు. సామాన్యుడు జనరల్ బోగిలలో మాత్రమే ప్రయాణించడానికి ఇష్టపడతారు. రైల్వేశాఖ వారు ఈమధ్య జనరల్ బోగీలను తగ్గించారు. జనంతో కిక్కిరిసి ఉంటున్నాయి. కిక్కిరిసిన జనంతో జనరల్ బోగిలలో ప్రయాణించే సమయంలో ఆ రైలుకు ఏదైన ప్రమాదం జరిగితే మరణించిన వారి వివరాలు రైల్వేశాఖవద్ద ఉండవు. జనరల్ బోగీ పెంచడం తోపాటు జనరల్ టిక్కెట్ తీసుకునే ప్రయాణికుల వివరాలు కూడా రైల్వేశాఖ నమో దు చేయాలనే సందేశాత్మకంగా ఈనాటిక సాగింది.




రావులపాలెం సీఆర్సీలో వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు, మూడోరోజు నాటిక పోటీలు ప్రారంభిస్తున్న సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు కాంస్య పతకం


కాంస్య పతక విజేతను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థి బెజవాడ మోహన్‌రాజ్ కాంస్య పతకం సాధించాడని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరిగిన ఉగాది పురస్కారాలలో మోహన్‌రాజ్‌కు పతకాన్ని ప్రదానంచేసి సన్మానించి అభినందించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆమె తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో నన్నయ అనుబంధ కళాశాల అయిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మోహన్‌రాజ్ 75 కిలోల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడని చెప్పారు. విద్యార్థులందరూ క్రీడలలో రాణించాలని కళాశాలలు, విశ్వవిద్యాలయం అందుకు తగిన ప్రోత్సాహం అందించాలని వీసీ సూచించారు. విద్యార్థి మోహరాజ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, నన్నయ అధికారులు అభినందించారు.

సత్యదేవుడి సన్నిధిలో దస్త్రాలకు పూజ


అనివేటి మండపంలో దస్త్రాలకు పూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2025-26ఆర్థిక సంవత్సరానికిగాను దేవస్థానంలో నిర్వహించే ఆర్థికలావాదేవీలు, ఇన్వెంటరీ దస్త్రాలకు సంబంధించి పుస్తకాలకు మంగళవారం అనివేటి మండపంలో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం చిట్టా పుస్తకాలను స్వామివారి పాదాలచెంత ఉంచారు. చతుర్వేద పండితులు వేదస్వస్తిఅందజేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

గిరిజనుల చేపల పండగ

ఎటపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజనులు చేపల వేటను పండగలా నిర్వహిస్తుంటారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట చెరువులో మంగళవారం గిరిజనులు ఉల్లాసంగా ఉత్సాహంగా చేపల వేటను సాగించారు. వేసవిలో తమ గ్రామాల పరిధిలో చెరువుల్లో ప్రతీఏటా గిరిజనులు చేపలవేట సాగిస్తుండడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో చెరువులో చేపల వేట కోసం చుట్టుపక్కల గ్రామాలైన కృష్ణవరం, నల్లకుంట, ఎర్రబోరు, గొందిరాజుపేట, చింతలచెరువు, పండువారిగూడెం, కొత్తూరు, పట్టుచీర, కన్నాపురం, తెలంగాణలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు చేపల వేటను జోరుగా నిర్వహించారు. సంప్రదాయ వలలతో కుటుంబ సభ్యులంతా మూకుమ్మడిగా వేటలో పాల్గొనడం విశేషం. వేటలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేపలను పట్టుకుని తీసుకెళ్లారు.


చెరువులో చేపల వేట నిర్వహిస్తున్న గిరిజనులు

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు శివారున ఉన్న తిరుమల విద్యా సంస్థల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ అండ్ ఎన్ఈఈటీలపై అవగాహన సదస్సు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. తమ పిల్లలు భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే ఎలా సంసిద్ధులు కావాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. వివరాలకు 7997071672, 7702449686లను సంప్రదించాలని తెలిపారు.

పనస చెట్టు మొదల్లోనే కాయల గుత్తులు

పి.గన్నవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పనసకు సాధారణంగా కొమ్మలతోపాటు కొంత ఎత్తులో చెట్టుకు కాయలు ఉంటాయి. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శివారు డీఎస్ పాలెంలో పనసచెట్టు మొదల్లో కాయలు గుత్తులుగా కాశాయి. ఆ పనసచెట్టు మొదల్లో 12 కాయలు కాసి చూపరులను అబ్బురపరుస్తోంది.


పనసచెట్టు కింది భాగంలో కాసిన కాయలు

భద్రత ఏది?



- బాలికల పాఠశాలల్లో మహిళా బోధకులే ఉండాలన్న నిబంధనకు ఐటీడీఏల తూట్లు
- అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నా దాచిపెడుతున్న వైనం
- అడ్డతీగలలో బాలికల విద్యాలయంలోనే బస చేస్తున్న పురుష సంక్షేమాధికారి
- గిరిజన విద్యాలయాల్లో బాలికలకు సంరక్షణ కరువు

(రంపచోడవరం/అడ్డతీగల-ఆంధ్రజ్యోతి)

గిరిజన విద్యాలయాల్లో బాలికలకు భద్రత కరువైంది. బాలికల పాఠశాలల్లో కచ్చితంగా మహిళా బోధకులు, మహిళా సిబ్బంది మాత్రమే ఉండాలన్న నిబంధనలకు భిన్నంగా రంపచోడవరం మన్యంలోని రెండు ఐటీడీఏల పరిధిలో పురుష బోధకులను కొనసాగిస్తుండటంతో గిరిజన బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తరచుగా గిరిజన బాలికలపై లైంగిక వేధింపులు చోటుచేసుకున్న విద్యాలయాలన్నీ పురుష ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులూ ఉన్నవే. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 35 గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో కేవలం 7 పాఠశాలలు మాత్రమే పూర్తిగా మహిళా ప్రధానోపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. పురుష ప్రధానోపాధ్యాయులు, పురుష ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోనే బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులు ఈ లోపాలను సరిదిద్దేందుకు, వాటిని పునరావృతం కాకుండా చూసేందుకు ఎటువంటి చర్యలను చేపట్టడం లేదు. తాజాగా అడ్డతీగల మండలంలో ఓ పాఠశాలలో ఓ ఘటనపై వదంతులు వచ్చాయి. అందుకు సంబంధించి వైద్య పరీక్షలు కూడా జరిగాయి. ఇదిలా ఉండగా ఆ విద్యాలయంలోనే ఓ గిరిజన సంక్షేమ పురుష అధికారి బస చేస్తుండటం కూడా వివాదంగా మారింది. బాలికల విద్యాలయంలోనే నిబంధనలకు విరుద్ధంగా బస చేస్తుండటాన్ని ఎవరూ అడ్డుచెప్పడంలేదు. ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడితేనే గిరిజన సంక్షేమానికి సార్థకత.

అమ్మో ఆరుగురా!



ఇదేంటో తెలుసా? టూ వీలర్. ఈ బండిపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలనేది ఒక నిబంధన. సాధారణంగా ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం చూస్తుంటాం. అయితే అదీ కూడా తప్పే. మరీ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో ఈ టూ వీలర్‌పై చూశారా... పరిమితికి మించి ఏకంగా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఏ వాహనమైనా అడ్డొచ్చిందంటే అంతే పరిస్థితి. ప్రమాదాలు చెప్పి రావండోయ్. నిబంధనలు పాటించాల్సిందే. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

ఫొటోగ్రాఫర్ - రాజమహేంద్రవరం

అన్నప్రసాదం స్వీకరించి ఇంటికి వెళ్తుండగా..

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గోపాలపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని వాదాలకుంట పంచాయతీ పరిధిలో వెదుళ్లకుంట యాద వోలు మధ్యలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగుడెం మండలం అంకాలగుడెం గ్రామానికి చెందిన బోడా పవన్‌కుమార్ (20) వెదుళ్ల కుంట గ్రామ శివారులో ఉన్న శ్రీ రేగులమ్మ ఆలయం వద్ద జరిగే అన్నప్రసాద కార్యక్రమానికి హాజరై ప్రసాదాన్ని స్వీకరించిన తరువాత తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వెదుల్లకుంట, యాదవోలు గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. పవన్‌కుమార్ తల, ఛాతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గోపాలపురం సామాజిక కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్

మారేడుమిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలవరం గ్రామంలో ఆర్థిక లావాదేవీల ఘర్షణలో తమ్ముడిని విల్లంబులతో హత్య చేసిన అన్నను అరెస్ట్ చేసినట్టు మారేడుమిల్లి సీఐ సీహెచ్‌గోపాలకృష్ణ తెలిపారు. గత నెల 23న తమ్ముడి సుగిరెడ్డిని అన్న లచ్చిరెడ్డి రూ.20వేలు అప్పు బాకీ తీర్చ లేదనే విషయంలో గొడవ పడి బాణాలతో కొట్టి చంపాడు. ఘటన తరువాత పరారీలో ఉన్నాడగా మంగళవారం నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో బెదిరింపులు

పోక్సో కేసు నమోదు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతుంది. ఆమె తల్లి బతుకుతెరువు కోసం గల్ఫ్‌లో ఉండగా తండ్రి కూడా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన గూడపాటి సంపత్ కుమార్ ప్రేమ పేరుతో బాలిక వెంటపడి తనను ప్రేమించకుంటే హని చేస్తానని ఏడాది కాలంగా బెదిరిస్తున్నాడు. బాలిక బంధువుల సాయంతో మంగళవారం ఆత్రేయపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాము తెలిపారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించడంపై ఫిర్యాదు

సీతానగరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రఘుదేవపురానికి చెందిన తన్నీరు జయమ్మ కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇల్లు నిర్మాణం కొనసాగిస్తున్నందున స్థానిక ఎస్ఐ డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి జి.జయభార్గవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రఘుదేవపురం చెరువు గట్టును ఆక్రమించి పాకల్లో నివాసముండేవారని వాటి స్థానంలో జయమ్మ ఇల్లు నిర్మిస్తుండడంతో పక్కనే ఉన్నవారు కోర్టును ఆశ్రయించగా పనులు నిలిపివేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. కానీ పనులు కొనసాగించడంతో పంచాయతీ నోటీసులు ఇచ్చినా తీసుకోవడంలేదన్నారు. దీంతో ఫిర్యాదు చేశామన్నారు.

ఆ స్థలం మాది.. కాదు మాది!

- ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణ స్థలంపై అన్నవరం దేవస్థానం, ఇరిగేషన్ శాఖ మధ్య వివాదం
- పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ఆదేశం



రెండుశాఖల మధ్య వివాదాస్పద స్థల సమస్యపై సర్వేలో పాల్గొన్న ఆర్డీవో, ఇతర అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క అన్నవరం దేవస్థానం, మరోపక్క ఇరిగేషన్ శాఖ ఆ స్థలం మాదంటే మాది అని రెండు దశాబ్దాలుగా పోరాటం చేయడం మధ్యలో సర్వే చేపట్టడం తదుపరి సర్వే రిపోర్టు రాకుండానే ఇరు శాఖల అధికారులు మిన్నకుండిపోవడం రివాజుగా మారిపోయింది. వివారాల్లోకి వెళితే అన్నవరం పంపా రిజర్వాయిర్‌ను ఆనుకుని ఒక ప్రయివేట్ రిసార్ట్ నిర్మించారు. ఈ నిర్మాణం దేవస్థానం ఆధీనంలో ఉందని అన్నవరం దేవస్థానం అధికారులు, లేదు ఇరిగేషన్ పరిధిలో ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం పెద్దాపురం ఆర్డీవో కె రమణి, ల్యాండ్ సర్వే రికార్డు ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహశీల్దార్ తాతారావు, దేవస్థానం అధికారులతో సర్వే చేపట్టారు. వివాదం పూర్వాపరాలు తెలుసుకున్న అనం తరం పదిరోజుల్లో ఆరెంపూడి అన్నవరం, బెండపూడి వరకు సరిహద్దులు నిర్ణయించి నివేదికను ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. ఇప్పటివరకు సత్యగిరి నుంచి ప్రారంభమైన సర్వే వివాదాస్పద స్థలం వద్దకు వచ్చేసరికి చల్లబడిపోయేవారు. అయితే తాజాగా వివాదాస్పద స్థలం ఉన్న సర్వే నంబరు 15 నుంచి 24 వరకు సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించడంతో ఈ సమస్య కొలిక్కివస్తుందా లేకుంటే షరామామూలేనా అని దేవస్థానం ఉద్యోగులు, గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సర్వేలో ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారులతో పాటు దేవస్థానం సహాయ కమిషనర్ రామ్మోహనరావు, సూపరెంటెండెంట్‌లు వీవీరమణ, బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు పాల్గొన్నారు.

మాటామాటా కలిపి.. శారీరక వాంఛ ఎర వేసి..

- మద్యంలో మత్తుబిల్లులు.. గడ్డిమందు కలిపి తాగించి సహకార ఉద్యోగిని నిలువు దోపిడీ చేసి పరారైన మహిళ
- మహిళతో పాటు సహకరించిన ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ రాత్రి వేళ పానీపూరీ బండి వద్ద 60ఏళ్ల సహకార ఉద్యోగితో ఓ మహిళ మాటామాటా కలిపింది. సెక్సువల్‌గా ప్రేరేపించింది. ఓ ఇంటికి తీసుకువచ్చి ఇద్దరు అనుచరులతో మద్యంలో మత్తుబిల్లలు, గడ్డి మందు కలిపి సదరు ఉద్యోగితో తాగించారు. ఆ వ్యక్తి అపస్మారక స్థితికి వెళ్లగానే నిలువు దోపిడీ చేసి పరారయ్యారు. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో సదరు ఉద్యోగి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ఈ కేసు వివరాలను అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం రాత్రి విలేకర్లకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అద్దెకు ఉంటున్న ఒక వ్యక్తి అల్లవరం మండలంలో ఒక పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్నాడు. గత నెల 17వ తేదీన సొసైటీ నుంచి రూ.లక్ష నగదు తీసుకుని అమలాపురం వచ్చాడు. ఆ రోజు రాత్రి 8.30 గంటల సమయంలో మద్యం సేవించి స్థానిక పానీపూరీ బండి వద్దకు వచ్చాడు. అక్కడే పానీపూరీ తింటున్న కాకినాడ మండలం తూరంగికి చెందిన కుమారి (30) పరిచయమైంది. మాటామాటా కలిపింది. అక్కడి నుంచి వారిద్దరు మోటారుసైకిల్‌పై బండారులంక వైపు వెళ్లారు. వారి ఏకాంతానికి సరైన ప్రదేశం లభించలేదు. దాంతో ఆ మహిళ అమలాపురంలో తనకు తెలుసున్న స్నేహితుని ఇల్లు ఉందని చెప్పి నమ్మించింది. ఇద్దరూ కలిసి అమలాపురం నారాయణపేటకు చేరుకున్నారు. ఇందుపల్లి గ్రామానికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యం ఆ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అప్పటికే వారి పథకం ప్రకారం బండారులంక ఎగ్జిబిషన్ వీధికి టి.వెంకటరమణను అక్కడకు రప్పించారు. మద్యం మత్తులో ఉన్న సొసైటీ ఉద్యోగిని జాగ్రత్తగా ఇంట్లోకి తీసుకువెళ్లారు. మద్యంలో తొలుత మత్తు బిల్లలు కలిపి ఇచ్చారు. అప్పటికీ ఉద్యోగి అలాగే ఉండడంతో వెంకటరమణ పథకం ప్రకారం గడ్డి మందును సిద్ధం చేసి ఉంచాడు. తొలుత కూల్‌డ్రింక్‌లో కొద్దిగా గడ్డిమందు కలిపి సహకార ఉద్యోగితో తాగించారు. ఈ తరువాత మద్యంలో గడ్డి మందు కలిపి తాగించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వారు ఉద్యోగి జేబులో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు అతడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని అపహరించుకుని పరారయ్యారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉద్యోగికి మెలకువ రాగా మోసపోయానని గుర్తించి ఎక్కడ పరువు పోతుందోనని ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇంటికి చేరుకున్నాడు. గడ్డి మందు తాగించడంతో అనారోగ్యం పాలవ్వగా ఇంటి వద్దే ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. అంతకంతకు బాధ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు గత నెల 26న నిలదీశారు. అప్పుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని అదేరోజున ఫిర్యాదు చేశారు. సీఐ వీరబాబు ఆధ్వర్యంలో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తూరంగికి చెందిన కుమారితో పాటు ఆమెకు సహకరించిన సుబ్రహ్మణ్యం, వెంకటరమణను మంగళవారం అరెస్టు చేసి వారి నుంచి బంగారు ఉంగరం, రూ.45వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్నామన్నారు. ఇదిలాఉండగా తీవ్ర అనారోగ్యానికి గురైన సహకార ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో వైద్యసేవలు పొందుతున్నాడు.

ఆసుపత్రి నుంచి పసికందు అపహరణ

పసిబిడ్డతో బస్సులో వెళ్లిపోతున్న మహిళను చింతూరులో పట్టుకున్న పోలీసులు

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత



పసికందుతో వెళ్తున్న మహిళను పట్టుకున్న పోలీసులు

రంపచోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి 5 రోజుల పసికందును గుర్తు తెలియని ఓ మహిళా అపహరించుకుని వెళ్లిపోగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. వై.రామవరం మండలం గుర్తేడు సమీపంలోని దుంపవలసకు చెందిన అందాల కళావతి 5రోజుల క్రితం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మగ బిడ్డకు ప్రసవించింది. మంగళవారం ఓ మహిళ నర్సుగా చెప్పుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఆ బిడ్డ తక్కువ బరువుతో జన్మించిందని, అత్యవసరంగా బాక్స్‌లో పెట్టాలని కామెర్లు వచ్చాయని వారిని నమ్మించి తీసుకెళ్లింది. కొంతసేపటికి తల్లిదండ్రులు పసిపిల్లల వార్డుకు వెళ్లి చూసుకోగా తమ బిడ్డ అక్కడలేదని గుర్తించారు. వెంటనే ఆసుపత్రి అధికారుల ద్వారా పోలీసు, ఐటీడీఏ, రెవెన్యూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం రంపచోడవరం డీఎస్పీ ప్రశాంత్ కుమార్ డివిజన్ మొత్తాన్ని అప్రమత్తం చేశారు. ఎక్కడిక్కడ వాహన తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రంపచోడవరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాజోలు నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కిందని సమాచారం తెలియడంతో డీఎస్పీ చింతూరు సబ్ డివిజన్ పోలీసులను అప్రమత్తం చేశారు. బస్సు చింతూరు చేరుకోగానే పోలీసులు చుట్టుముట్టి పసిబిడ్డతో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా ఆ మహిళే పసిబిడ్డను అపహరించిందని గుర్తించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ఆ పసిబిడ్డను వైద్యులతో పరీక్షించి మహిళను రంపచోడవరం తరలించారు. ఆ పసికందును తల్లి దండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనతో ఆసుపత్రిలో నిర్వహణలోపం,భద్రత తేటతెల్లమైంది.

కేసు నమోదు చేశాం : డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి పసికందును అపహరించిన కేసులో కత్తి అశ్విని అనే మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నామని డీఎస్పీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పసికందును తల్లిదండ్రులకు అప్పగించి మీడియాతో మాట్లాడారు. నిందితురాలిని పట్టుకోవడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐలు ఆర్‌జె.రవికుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, టి.దుర్గాప్రసాద్, ఎస్ఐలు డి.భూషణం, బి.వినోద్, పి.రమేష్, ట్రైనీ ఎస్ఐలు ఎస్.గిరిధర్‌బాబు, వి.సుజాత, సురేష్ పాల్గొన్నారు.

విషమంగానే నాగాంజలి పరిస్థితి

ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడి

న్యాయం చేయాలని తల్లిదండ్రుల డిమాండ్



రాజమహేంద్రవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రభుత్వ వైద్యుల బృందం

రాజమహేంద్రవరం అర్బన్/సిటి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంనకు చెందిన ఎన్.నాగాంజలి(ఫార్మసిస్ట్) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో మంగళవారం బోధనాసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అనస్థీషియా ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ నీలిమ విలేకర్లతో మాట్లాడారు. నాగాంజలికి రోజు రోజుకు ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నదన్నారు. గత నెల 28వ తేదీ నుంచి ఆమె ఆరోగ్యంపై ఫాలో అవుతున్నామన్నారు. బ్రెయిన్‌కు ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల డ్యామేజీ ఎక్కువగా జరిగిందని భావిస్తున్నామన్నారు. పేషెంట్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో వేరేచోటకు షిఫ్ట్ చేసే అవకాశం లేదని, ఆరోగ్య పరిస్థితి అంత క్రిటికల్‌గా ఉందన్నారు. బీపీ డౌన్ అవుతోందని, ఫీవర్ పెరుగుతున్నదన్నారు. జాండీస్ కూడా వచ్చిందన్నారు. బొల్లినేని ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పూర్తిస్థాయిలో జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇలా ఎన్నిరోజులు కండీషన్ ఉంటుందనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు మాజీ ఎంపీ భరత్‌రామ్, యాంకర్ శ్యామల, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆసుపత్రి ఐసీయూలో ఉన్న నాగాంజలిని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. ఇదే ఆసుపత్రిలో అంజలి ఇంజక్షన్ చేసుకుందని కానీ ఆ దృశ్యాలు రికార్డయిన సీసీ ఫుటేజీని మాత్రం ఇప్పటి వరకు బాధిత తల్లిదండ్రులకు ఇవ్వలేదన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాగాంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డను మాతో ఆరోగ్యంగా పంపాలన్నారు. గత పది రోజులుగా ఎటువంటి మార్పులేదని మా లాంటి పరిస్థితి ఎవ్వరికి రాకుడదన్నారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.వసుంధర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక నాగాంజలిని పరిశీలించారు.

4న అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శన

రాజమహేంద్రవరంలో నిర్వహణ : కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, కమిషనర్



సెంట్రల్ జైలు రోడ్డులో చేస్తున్న ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఈనెల 4న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రోడ్డులో ఆర్ట్స్ కాలేజి నుంచి జీజీహెచ్ వరకూ నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆమె మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఎం.మల్లిఖార్జునరావుతో కలసి చిత్రకళా వీధి ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావడం కోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సుమారు 500 మందికి పైగా కళాకారులు వస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని వీధి ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రదర్శనలో భాగ స్వామ్యం కోరుకునేవారు అమరావతి ఆర్ట్ ఫెస్టివల్.కామ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల రోడ్డులో అమరావతి వీధి ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారీ

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ముతో వార్డు సచివాలయ ఉద్యోగి పరారీ అయ్యాడు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘం ఆరవ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న యర్రా వెంకటరమణ 12,13 వార్డులకు పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు రూ.1.50లక్షలకు వెంకటరమణకు ఇవ్వగా మరో రూ.32 వేలు వార్డు సచివాలయం అడ్మిన్ వద్ద ఉంచారు. ఉదయమే లబ్ధిదారులకు పింఛన్‌ను ఇవ్వాల్సిన వెంకటరమణ ఇవ్వలేదు. పింఛన్ సొమ్ము రూ.1.50లక్షలతో పరారీ అయినట్టు గుర్తించి మున్సిపల్ కమిషనరు కనకారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 4 నెలల క్రితం ఇదే ఉద్యోగి లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని పింఛన్ సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోగా, ఉన్నతాధికారుల హెచ్చరికలతో తిరిగి వచ్చి సొమ్ములు అందజేశాడు. ఇప్పుడు విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు కమిషనరు ధృవీకరించారు.

'పది' పరీక్షలు పూర్తి...

స్నేహితులతో స్నానానికి వెళ్లి...

కాలువలో మునిగి విద్యార్థి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో యువనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి(16) మంగళవారం రామచంద్రపురం మండలం వెల్ల వద్ద కాలువలో మునిగి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పిల్లా వారి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మంగళవారం పది పరీక్షలు పూర్తికావడంతో స్నేహితులతో కలసి వెల్ల వద్ద కాలువలో స్నానానికి వెళ్లారు. ఇద్దరు మాత్రమే కాలువలోకి దిగారు. ఒకరు కాలువలో మునిగిపోయాడు. మిగిలినవారు ఇంటికి సమాచారం ఇవ్వడంతో కటుంబ సభ్యులు కాలువ వద్దకు చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని బయటకుతీశారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు, సమాచారం లేదని ద్రాక్షారామ పోలీసులు తెలిపారు.

'కోర్ట్' నటుడికి ఘన స్వాగతం

స్వగ్రామం వచ్చిన రోషన్



కూనవరంలో ర్యాలీగా వస్తున్న రోషన్



కూనవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలై విశేష ఆదరణ పొందిన కోర్ట్ సినిమాలో కీలకపాత్రలో నటించిన రోషన్ స్వగ్రామమైన కూనవరంలో మంగళవారం అడుగుపెట్టడంతో అతని అభిమానులు అడుగడుగున నీరాజనంతో ఘనస్వాగతం పలికారు. రోషన్ పుట్టిన ఊరు కూనవరం. దీంతో రోషన్ సలార్, విరూపాక్ష తదితర సినిమాల్లో నటించాడు. ఇటీవల అగ్రహీరో మెగాస్టార్ చిరంజీవి కోర్ట్ సినిమా బృందాన్ని తన ఇంటికి పిలిపించుకుని అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. మండలంలో రోషన్ పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన స్వగ్రామమైన కూనవరంలో ఇంతటి అభిమానం చూపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అభిమానుల ఆసక్తి మేరకు మరిన్ని చిత్రాల్లో నటించి కూనవరానికి, తన కుటుంబానికి, అభిమానులకు మంచి పేరు తీసుకువస్తానని పేర్కొన్నాడు.

కాంతి కిరణం!

ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. సూర్య కిరణాల ధాటికి ప్రజలు విలవిల్లాడున్నారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సూర్య కిరణం ఓ కాకి మీద పడుతున్నట్టు కనిపించిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

ఫొటోగ్రాఫర్ - కాకినాడ




కడియంలో సభ్యత్వ కార్డులు చూపుతున్న ఎమ్మెల్యే గోరంట్ల, టీడీపీ నాయకులు

కుటుంబ సాధికార సారథులను నియమించాలి

● ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు గౌరవం, మంచి గుర్తింపు ఇచ్చే విధంగా సభ్యత్వకార్డును రూపొందించాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. గోరంట్ల కార్యాలయంలో మంగళవారం కడియం మండలం, రూరల్ నియోజకవర్గంలో వార్డులు క్లస్టర్స్ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. సభ్యత్వాలను బూత్‌లవారీగా విభజించి 264 బూత్‌లకు ఇస్తామన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీను, బోడపాటి గోపి, పితాని శివ పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు సభ్యత్వ కార్డు

రాజమహేంద్రవరంరూరల్: ప్రతీ కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందజేసేలా టీడీపీ కుటుంబ సభ్యులు అంతా బాధ్యత తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ ఆరోగ్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్ తెలిపారు. గోరంట్ల కార్యాలయంలో మంగళవారం రూరల్, సిటీ మున్సిపల్ వార్డులు, క్లస్టర్స్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 57వేలకుపైగా సభ్యత్వాలు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో నిమ్మలపూడి గోవిందు, శీలం గోవిందు, రొంపిచర్ల ఆంటోని, యార్లగడ్డ శేఖర్, ఎంఎంఎల్ రాజు, చెలుమూరి సత్యనారాయణ, ఏడాకుల వెంకటేశ్వరరావు, మానుపాటి తాతారావు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు!


ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమావేశం

● ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే బత్తుల ఆదేశం

కోరుకొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవికాలం దృష్టిలో ఉంచుకుని రాజానగరం నియోజకవర్గంలో అన్నిగ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గ్రామీణ మంచినీటి సరఫరా అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి పరిస్థితుల్లోను, ఏ గ్రామంలోను నీటి సమస్య రాకూడదన్నారు. అందుకు అవసరమైన ముందస్తుచర్యలు తీసుకోవాలన్నారు. కూనవరం, గాదరాడ, కణుపూరు గ్రామాల్లో నీటి సమస్యపై ఆయన సమీక్ష నిర్వహించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్రామాలలో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముగ్గళ్ళ వాటర్‌ట్యాంక్‌కు 24గంటలు విద్యుత్ సరఫరా, వినగంటి వారిపేట కరెంటు సమస్యపై ఆ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. జంబూపట్నం, నర్సాపురం, ముగ్గినాడపాకలు, మల్లంపూడి, తోకాడ, పాత దుంగపాడు, రామేశ్వరంపేట, దివాన్‌చెరువు, మిర్తిపాడు, చౌనకొండేపల్లి, లింగవరం, బొబ్బిల్లంక, సుబ్బారావుపేటవాటర్ ట్యాంక్ నిర్మాణాలను ఆయన సమీక్షించారు. వెంటనే ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. కోటికేశవరం, బూరుగుపూడి, నర్సాపురం, దోసకాయలపల్లి, మునగాల గ్రామాల్లోట్యాంకులు, పైపులైన్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. రఘుదేవపురం కొత్తవాటర్ ట్యాంక్ నిర్మాణం, చినకొండేపూడిలో పైపులైన్ నిర్మాణంపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలో రూ.12కోట్లతో 19పనులు చేపట్టారని, అందులో రూ.7.89కోట్లతో పనులు పాక్షికంగా చేశారని, మిగిలిన రూ.5.58 కోట్లతో తక్షణం పనులు పూర్తిచేయాలని అందుకు అవసరమైన అనుమతులు తీసుకొస్తామన్నారు. రూ.1.28కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా కోటికేశవరం, బూరుగుపూడి, నర్సాపురం, దోసకాయలపల్లి, మునగాల గ్రామాలలో టెండర్ పూర్తయిన వెంటనే పనులు పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా చక్రద్వారబందంలో రూ.16.50లక్షలతో డీఎం ఎంతో మంజూరైన బోర్‌వెల్‌కు టెండర్లు పిలిచారని త్వరలో పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రాజానగరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో కలవచర్ల గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పామాయిల్ చెట్లకు రింగ్ ట్రెంచెస్ కార్యక్రమంలో కూలీలతో కలిసి ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొట్టి, పార, గడ్డపార చేతపట్టి పనులు ప్రారంభించారు. గ్రామంలో పశువుల నీటితొట్టెల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో జేఏ ఝాన్సీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బత్తులకు ఘన సన్మానం

సీతానగరం: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను సీతానగరం మండలం ఏటిగట్టు గ్రామాల కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గద్దే వెంకటకృష్ణచౌదరి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి రోడ్డు శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు నరకప్రాయంగా మారిందని ఇటువంటి రోడ్డుకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషితో 12.5కోట్ల రూపాయలు మంజూరు చేయించారని రెండురోజులలో శంకుస్థాపన చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటిగట్టు ప్రాంతవాసులు ఊపిరిపీల్చుకున్నారని అన్నారు.

ఎన్టీఆర్ ఆలోచనతోనే పేదలకు సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


అనపర్తిలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్టీఆర్ ఆలోచనతోనే పేదలకు సంక్షేమఫలాలు అందుతున్నాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ వారా కుమారి, బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన జరిగిన నూతన వితంతు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.35తో ప్రారంభించిన పింఛన్లు నేడు రూ.4వేలకు చేరుకున్నాయన్నారు. పేదలకు ఇచ్చే పింఛన్లను కొంతమంది దోచుకుంటున్నారని అటువంటి వారిని తొలగించి అర్హులైన వారికి మంజూరు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అనపర్తి మండలానికి మంజూరైన 35మందికి, బిక్కవోలు మండలానికి మంజూరైన 40పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో అనపర్తి కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి తాతారెడ్డి, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, బిక్కవోలులో ఎంపీపీ సుమ, వేణుగోపాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబు చౌదరి పాల్గొన్నారు.

29 కొత్త పింఛన్ల పంపిణీ

రంగంపేట: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెలా ఒకటో తేదీన జరుగుతున్న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో భాగంగా రంగంపేట మండలంలో నూతనంగా మంజూరైన 29 పింఛన్లను కూటమి నాయకులు మంగళవారం పింఛన్లు దారులకు పంపిణీ చేశారు. వడిశలేరులో నూతనంగా మంజూరైన పింఛన్లను టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8735 పింఛన్లు ఉండగా 3కోట్ల77లక్షల65రూపాయలు పంపిణీ చేశామన్నారు.

వైసీపీ మహిళా నాయకులు ఇన్ని రోజులు నిద్రపోయారా

● తెలుగు మహిళా నేతల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న మాలే విజయలక్ష్మి

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):అంజలి ఆత్మహత్యాయత్నంచేసి కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఐసీయూలో ఇన్నిరోజులుగా చికిత్స పొందుతుంటే ఇప్పటిదాకా నిద్రపోయి ఇప్పుడే లేచి వచ్చి తామేదో సాధించినట్లు వైసీపీ మహిళలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని తెలుగు మహిళా నేతలు ధ్వజమెత్తారు. స్థానిక తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు మహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, బీజేపీ నాయకురాలు పన్నాల లక్ష్మిసంతోషి మాట్లాడారు. అంజలికి మెరుగైన వైద్యం అందేలా తమ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసులు అన్నిఏర్పాట్లు చేశారని కలెక్టర్ ప్రశాంతి ప్రభుత్వాసుపత్రి వైద్యబృందాన్ని నియమించారని, దీపక్‌ను పోలీసులు అరెస్టు చేశారని అతనికి కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారని ఇన్ని జరిగితే ఇప్పుడు వైసీపీ మహిళలు వచ్చి వైద్యం అందడంలేదని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంజలి త్వరగా కోలుకోవాలని తామంతా కోరుకుంటున్నామన్నారు. యాంకర్ శ్యామల ఇప్పుడు వచ్చి ఏదో స్పెషలిస్టులా వైద్యం అందడంలేదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. భరత్‌రామ్ ఈ సంఘటనను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నాడని అన్నారు. తెలుగు మహిళా నాయకులు తురకల నిర్మల, మీసాల నాగమణి, మోహిని, బోను ఈశ్వరి, కానేటి కృపామణి, దొంగ నాగమణి, మోతా నాగలక్ష్మి, తుళ్ళిపద్మ, కర్రం లక్ష్మినాయుడు, నాగలక్ష్మి, విజయ, బర్ల గిజ, మీనా క్షి, దేవి, కనకదుర్గ, సుశీల, కోన సత్య, బూరా కల్పన ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శ్రీక్మి పరిశీలించారు. మంగళవారం పర్యవేక్షణ గృహానికి వెళ్లి బాలలతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చెబుతున్నా పాఠాలపై ఆరా తీశారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకోవాలని సూచించారు. క్రమశిక్షణ సహన శీలత మనిషికి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణాలను వీటిని అలవర్చుకోవాలని చెప్పారు. ఉచితంగా న్యాయవాదిని పొందడం వారి హక్కు అని తెలిపారు. వసతిగృహంలో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయసహాయం కావాలన్నా డీఎల్ఎస్ఏకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి జడ్జి వెళ్లారు. అక్కడ ఏర్పాటుచేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో వృద్ధులకు నల్సా పథకం 2016పై అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్య లు ఉంటే న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

యాదవులకు అండగా నిల్చిన టీడీపీ

● రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగు

దివాన్‌చెరువు, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు మరీ ముఖ్యంగా యాదవులకు ఉన్నత పదవులు ఇచ్చి అండగా నిల్చిన ఘనత టీడీపీకే దక్కుతుందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. బీసీలకు వెన్నుదన్నుగా నిల్చి వారిని అన్నిరంగాలలో ప్రోత్సహించిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబునాయుడులకు చెందుతుందని చెప్పారు. రాష్ట్ర యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం ఉదయం 9గంటలకు విజయవాడలోని తమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కూటమి పార్టీలనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంఘీయులు అధిక సంఖ్యలో హాజరై ఈకార్యక్రమం విజయవంతం చేయాలని నాగు విజ్ఞప్తిచేశారు.

భూ సమస్యల పరిష్కారానికి
మీ కోసం మా సలహా ఆన్‌లైన్ సేవాకేంద్రం


ఆన్‌లైన్ సేవాకేంద్రం ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):భూ సమస్యల పరిష్కారానికి సక్రమ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మీకోసం మా సలహాపేరిట విశ్రాంత రెవెన్యూ ఉన్నతాధికారి మారిశెట్టి జితేంద్ర స్వచ్ఛందంగా ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ సేవాకేంద్రం వెబ్‌సైట్‌ను మంగళవారం మధ్యాహ్నం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. స్థానిక ప్రకాశంనగర్ ధర్మంచర కమ్యూనిటీ హాల్‌పైనగల బుక్‌బ్యాంక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జితేంద్ర మాట్లాతూ రెవెన్యూ విభాగంలో చిన్న చిన్న సమస్యలు సైతం ఏళ్లతరబడి, పరిష్కారం కాకుండా జాప్యం అవుతున్నాయని అలాపరిష్కారం కాకుండా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఈ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని, సెల్‌నెం. 8019569393కు వాట్సాప్ చేస్తే,దాని పరిష్కారానికి తగిన సూచనలు వివరిస్తామని తెలిపారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, మారిశెట్టి జితేంద్ర భూ సమస్యల గురించి ఇలాంటి ఆన్‌లైన్ సేవా కేంద్రం ప్రారంభించడం అభినందనీయమని ప్రశంసించారు. అశోక్‌కుమార్‌జైన్, కార్టూనిస్ట్‌శేఖర్, ఉమామహేశ్వరరావు, సీపీ రెడ్డి, గుబ్బల రాంబాబు, వీఎస్ఎస్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ పదవిపై మాజీ ఎమ్మెల్యేకు మాట్లాడే అర్హత లేదు

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఎంపీపీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించి ఎంపీపీ పీఠం కైవసం చేసుకోవడంపట్ల మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పోటీలో నిలువలేక పరారైన వైసీపీ నాయకులకు ఎంపీపీ ఎన్నికపై మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంపీపీ తేతలి సుమతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రెండు వాక్యాలు మాట్లాడారని ఎవరో రాసిన స్క్రిప్టును ఆయన పూర్తిగా చదవలేకపోయారని ఎవరికో పుట్టిన బిడ్డ అంటూ ఆయన వ్యాఖ్యలు ఆయనకే చెందుతాయని ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదివే వారికే ఈ సామెత వర్తిస్తుందన్నారు. మాజీ ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి ఆమె భర్త మూడున్నర సంవత్సరాలు చేసిన అరాచకపాలన తట్టుకోలేకే ఎంపీటీసీలు బీజేపీలో చేరారని అన్నారు. వైసీపీ నాయకులు ప్రకటించిన ఎంపీపీ అభ్యర్థి కనీసం నామినేషన్ కూడా ఎందుకు వేయలేదో మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ తేతలి సుమ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపీ వ్యాఖ్యలు అర్థరహితం

● బిక్కవోలు ఎంపీపీ తేతలి సుమ

బిక్కవోలు ఎంపీపీ ఎన్నిక సందర్భంగా బిక్కవోలు ఎంపీటీసీలను ప్రలోభ పెట్టారని, బెదిరింపులకు గురిచేశారని అందుకే వారు పార్టీ మారారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బిక్కవోలు ఎంపీపీ తేతలి సుమ, బీజేపీ ఎంపీటీసీలు అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ తమను ఎవరూ ప్రలోభ పెట్టలేదని మూడున్నర సంవత్సరాల్లో తాము ఎంపీటీసీల మనే వైసీపీ నేతలు గుర్తించలేదని కూటమి వచ్చిన తొమ్మిది నెలల్లోనే తమను ఎమ్మెల్యే నల్లమిల్లి ఎంపీటీసీలుగా గుర్తించి తగిన గౌరవం అందించారని, అంతేకాకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అందుకే బీజేపీలో చేరామని వారు వివరించారు. సమావేశంలో ఎంపీటీసీలు చిన్నం వీర్రాఘవరెడ్డి, తొండాపు శాంతి శ్రీలక్ష్మి, కొర్ల చక్రరావు, జంపా వెంకటలక్ష్మి, గొర్రెల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

● రాజమహేంద్రవరం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతికోసం, దేశ పురోభివృద్ధికోసం అనునిత్యం ప్రార్ధనలు చేసే క్రైస్తవులను రెచ్చగొట్టి కించపర్చొద్దని రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ పడగాల మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, క్రైస్తవులపై దాడులను నియంత్రించాలని కోరుతూ రాజమహేంద్రవర ంలో అన్ని క్రైస్తవ సంఘాలతో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్డులోని నెతన్యచర్చ్ నుంచి ప్రారంభమై గోరక్షణపేట, జాంపేట గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. మహాత్మాగాంధీ విగ్రహంవద్ద కొద్దిసేపు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం గణేష్‌చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు శాంతి ర్యాలీ చేరుకుంది. ఈసందర్భగా అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద బైఠాయించి సుమారు గంటపాటు నిరసన చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు ప్రతాప్ సిన్హా, డాక్టర్ కే సుధీర్‌కుమార్, డాక్టర్ జుహనీ హోలీనిన్, పి.ఎర్నెస్ట్ మోజెష్, పి.విక్టర్, ఎన్ఎస్‌సి ప్రసాద్‌లు ఆర్డీవో కృష్ణనాయక్‌ను కలిపి వినతిపత్రం అందించారు. అనంతరం డాక్టర్ ప్రతాప్‌సిన్హా, డాక్టర్ కె.సుధీర్ కుమార్‌లు మాట్లాడారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. రాజమహేంద్రవరంరూరల్ కొంతమూరు సమీపంలో ఈనెల 24న జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై క్రైస్తవ సమాజానికి ఉన్న అనుమానాలను నివృత్తిచేయాలని పోలీస్ శాఖను ప్రభుత్వాన్ని కోరారు. ఈ శాంతి ర్యాలికి దళిత ప్రజా సంఘాల నాయకులు లాజర్, ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకటరత్నం, జంగా బాబురావులు మద్దతు తెలిపారు. ఈ శాంతి ర్యాలీలో పాస్టర్లు ఎం.విజయసారధి, డాక్టర్ జి.జాన్‌ప్రసాద్, డాక్టర్ జె.షారోన్ కుమార్, డాక్టర్ నిర్మల ప్రశాంత్‌కుమార్, ఏ.కనకరాజు, డాక్టర్ సునీత సిన్హా, డాక్టర్ లలిత సుధీర్, శ్యాంసన్‌రాజు, అబి శిక్ష ఆచార్య డాక్టర్ మల్లిపూడి మార్టిన్ లూథర్, పీఎం రాజు, ఎన్ సీమోను సుదర్శన్, ఎన్. విలియం బెట్టిక్ పాల్గొన్నారు.

ఇళ్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు వద్దు

● ప్రచార క్యాంపెయిన్ స్టిక్కర్లు ఆవిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు ప్రీపెయిడ్ స్మార్టు మీటర్లు వద్దని, కరెంట్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఇంటింటికీ స్టిక్కర్ల ప్రచార క్యాంపెయిన్ నిర్వహిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ వెల్లడించారు. ఈమేరకు మంగళవారం స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎనిమిది సార్లు కరెంట్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోపారని, ఈ సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితర నాయకులు బాదుడే బాదుడు అనే కార్యక్రమంతో వ్యతిరేకించారని అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోనూ సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలను మోపడం సరికాదని పేర్కొన్నారు. దీంతోపాటు అదానీతో చేసుకున్న స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని అమలు చేయడంతో ప్రజలపై మరో పిడుగు వేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ప్రజలపై భారాలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

గోకవరం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట మార్కెట్‌యార్డ్ చైర్మన్ అడపా భరత్ అన్నారు. మండలంలోని కామరాజుపేట గ్రామంలో 2025-26కిగాను మంజూరైన ఉపాధి పనులను మంగళవారం ఆయన సర్పంచ్ అడపా వెంకట్రావుతో కలిసి ప్రారంభించారు. భరత్ మాట్లాడుతూ ఉపాధి పనులలో భాగంగా పంచప్రాధాన్యాల పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఏపీవో అ ప్పలరాజు మాట్లాడుతూ 2025-26కిగాను 5,30,000 పనిదినాలు లక్ష్యంగా నిర్ధేశించామన్నారు. దినసరి వేతనం రూ.300ల నుంచి రూ.307ల వరకు పెంచామన్నారు.

6న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

రాజమహేంద్రవరంకల్చరల్ ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): శ్రీరామ ఉత్సవ సమితి పక్షాన ఈనెల 6వ తేదీ శ్రీరామ నవమి రోజు మధ్యాహ్నం 3 గంటలకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది పతివాడ రామరాజు, కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప చెప్పారు. ఈ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక జాంపేట గణేష్ చౌక్ ప్రెస్‌క్లబ్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. రామరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా శ్రీరామనవమిరోజు భారీఎత్తున బైక్ ర్యాలీ చేస్తున్నామని తెలిపారు. బ్రహ్మంగారి మఠం విరజానందస్వామి ముఖ్యఅతిథిగా హాజరవుతారని రామరాజు అన్నారు. సహకార్యదర్శి న్యాయవాది కెఎల్‌భవాని, కార్యవర్గ సభ్యులు గండేపూడి సురేష్, బండ్ల శంకర్, ఎ.సత్య శివకుమార్, కర్రి శ్రీనివాస్, పుల్లల చెరువు రామ గోపాలరెడ్డి, చిన్నబాబు, సత్యసీహెచ్ లీలాశంకర్, దినేష్‌లాల్, ఎ.వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్ చిత్రపటాలపై పేడకళ్లాపులు

● ఎంఆర్‌పీఎస్ నేత ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించి శాసనమండలిలో కనీసం చర్చకు కూడా రానివ్వకుండా చేసిన మాజీ సీఎం జగన్ తీరును ఖండిస్తూ అతని చిత్రపటాలతో మాదిగపల్లెల్లో పేడ కళ్ళాపులు చల్లిస్తామని ఎంఆర్‌పీఎస్ నేత ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు అందరూ సమర్థిస్తున్నారని కానీ ఆంధ్రప్రదేశ్‌లో శాసన మండలిలో మాత్రం బిల్లు ప్రవేశపెట్టకుండా, కనీసం చర్చకు కూడా రాకుండా మాజీ సీఎం జగన్ చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసనసభలో సీఎం చంద్రబాబు వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తే శాసనమండలిలో చర్చ కూడా జరగనివ్వలేదన్నారు. ఇందుకు నోరుమెదపని వైసీపీలో మాదిగలను నిలదీస్తామన్నారు. దివంగత వైఎస్ఆర్ ఆశయానికి జగన్ తూట్లుపొడిచాడన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మునిసిపల్ చైర్మన్ పోతుల వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మాజీ మునిసిపల్ చైర్మన్ పోతుల వీరభద్రరావు 26వ వర్ధంతి సభ స్థానిక టౌన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రఫీ, టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, వీరభద్రరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు సత్తి పెదగంగిరెడ్డి, సాహితీవేత్త వీవీ సుబ్రహ్మణ్యం, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సింగారం భాస్కర్, లాఫింగ్ అధ్యక్షుడు మొహమ్మద్‌ఖాదర్‌లను ట్రస్టు తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పోతుల వీరభద్రరావు, ట్రస్టు అధ్యక్షుడు బీవీఎస్ మూర్తి అధ్యక్షత వహించగా, మాజీ డిస్ట్రిక్ట్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలనాయుడు, మేడా గురుజత్ ప్రసాద్, తోట సుబ్బారావు, బేరూలాల్ జైన్, కూరగంటి సతీష్, టేబుల్ టెన్నిస్‌కోచ్ వీటీవీ సుబ్బారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పలువురికి ఉగాది పురస్కారాలు

ధవళేశ్వరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీ గాయిత్రి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, శ్రీ వాసవీ కళానికేతన్, ది నేషనల్ కంజూమర్స్ రైట్స్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారంరాత్రి ధవళేశ్వరం శివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు. బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు వెలివెంటి నాథవరప్రసాద్(రాజా) అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సినీ నటుడు, గాయకుడు శ్రీపాదజిత్ మోహన్‌మిత్ర విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్య శంకర్రావు రచించిన శంకరాంతరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయంగా రూ.30వేలు చెక్కు అందజేశారు. అంతకుముందు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ రంగాల్లోసేవలు అందించిన, పేరుగాంచిన హైకోర్టు అడ్వకేట్ లక్ష్మితులసి, కండవల్లి సాయితేజ, పన్నాల వెంకటలక్ష్మి, మంగలంపల్లి చంద్రశేఖర్ శాస్త్రి, నాగ ఫణిశర్మ తదితరులను ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు.


శంకరాంతరాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



టెన్‌షన్ తీరింది!

ముగిసిన పది పరీక్షలు..3 నుంచి మూల్యాంకనం

చివరి రోజు 406 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల టెన్‌షన్ తీరింది.. ఎప్పుడెప్పుడు పరీక్షలు ముగుస్తాయా అని విద్యార్థులు చూశారు.మంగళవారంతో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పదవ తరగతి పరీక్షలు ఈనెల 17న ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచి మొత్తం 25,723 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు సిద్ధమయ్యారు. అందులో 24,763 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 960 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నట్టు డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. మంగళవారం చివర పరీక్షగా జరిగిన సోషల్ పరీక్షకు 23,440 మంది హాజరు కాగా 406 మంది గైర్హాజరయ్యారు.కారణాలేంటో కానీ ఈ సారి ప్రతి పరీక్షకు వందల సంఖ్యలో విద్యార్థులు గైర్హాజరవడం కనిపించింది.తొలిరోజు నుంచి ఆ లెక్క ఇలా ఉంది. తెలుగు పరీక్షకు 461 మంది, హిందీకి 377 మంది, ఇంగ్లీష్‌కు 385 మంది, సంస్కృతం పరీక్షకు 45 మంది, లెక్కల పరీక్షకు 466 మంది, పీఎస్‌కు 461 మంది, ఎన్‌ఎస్‌కు 421 మంది, సోషల్ పరీక్షకు 406 మంది గైర్హాజరవడం గమనార్హం.ఈ నెల 3వ తేదీ నుంచి పరీక్ష పేపర్ల మూల్యాంకనం జరగనుంది.

పింఛన్ల పంపిణీలో ఆరో స్థానం

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు మంగళవారం 95.67 శాతం పంపిణీ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిం ఛన్లు పంపిణీ చేశారు.వేరే ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉండిపోవడం తదితర కారణాల వల్ల మిగతావారికి పంపిణీ చేయలేకపో యి నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం పింఛన్ల సంఖ్య 2,35,076గా ఉంది. అందులో తొలిరోజు 2,24,891 మందికి పింఛన్ల సొమ్ము అందజేశారు. మొత్తం జిల్లాకు రూ.102,28,25,500 అందులో కోట్ల పింఛన్ల సొమ్ము విడుదల కాగా రూ.97,63,87,000 పంపిణీ చేశారు.తొలి రోజు పింఛన్ల పంపిణీలో జిల్లాకు 6వ స్థానం లభించింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్వ యంగా లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పలు నియో జకవర్గాల్లో ఎమ్మెల్యేలు పంపిణీ చేయడం గమనార్హం.



పెరవలి మండలం ముక్కామలలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

భానుడికీ..గొడుగు!



సాధారణంగా గొడుగు ఎప్పుడు వాడతాం.. వర్షం పడితే.. ప్రస్తుతం వర్షాకాలం కాకపోయినా గొడుగులకు డిమాండ్ వచ్చింది.. భానుడు మండిపడుతుండడంతో గొడుగుల వినియోగం పెరిగింది..ఈ చిత్రంలోనే చూడండి.. రాజమహేంద్రవరంలో మంగళవారం మధ్యాహ్నం ఒక జంట గొడుగు నీడన భానుడికి చిక్కకుండా ఎలా వెళుతున్నారో.. ఐడియా బాగుంది కదూ మనమూ ఒక గొడుగు కొనేద్దాం ఇక పదండి మరి..!

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



పెరవలి మండలం ముక్కామలలో నీటితొట్టెల నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి దుర్గేష్

157 నీటితొట్టెల నిర్మాణం

- ఉపాధి హామీ పథకంలో పనులు
- 15 మండలాల్లో ఏర్పాటు
- పశువుల దాహార్తి తీర్చడమే లక్ష్యం
- మంత్రి కందుల దుర్గేష్


పెరవలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 157 నీటి తొట్టెల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద వేసవి కాలంలో పశువులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదించినట్టు చెప్పారు. పశువుల తాగునీటి అవసరాలకు చేపట్టిన తొట్టెలకు నీటి కనెక్షన్ సంబంధిత గ్రామ పంచాయతీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వెటర్నరీ విభాగం పశువైద్య శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా 157 గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మండలాలు వారీగా చాగల్లు 10, దేవరపల్లి 10, గోపాలపురం 4, కొవ్వూరు 8, నల్లజర్ల 5, రాజానగరం 44, రంగంపేట 15, పెరవలి 18, తాళ్ళపూడి 5, నిడదవోలు 23, ఉండ్రాజవరం 15 చొప్పున నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం.నాగ మల్లేశ్వరరావు, పీడీ ఆర్డీఏ ఎన్‌వీవీ ఎనహార్తి, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులపై మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాం తి, జేసీ ఎస్.చిన్నరాముడు, అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతి నివేదికలు కూడా అందజేయాలన్నారు. నిడదవోలులో ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నిడదవోలులో సమస్యలేమైనా ఉంటే అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఎర్రకాలువ పనుల పరిస్థితిపై కూడా చర్చించా రు. రానున్న సమావేశం నాటికి వివిధ శాఖలు నిర్దేశించుకున్న లక్ష్యాలతో నియోజకవర్గ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

7 ఫార్మసిస్ట్ నాగాంజలి పరిస్థితి విషమం

4న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన 8



వెలుగుబంద కాలనీలో చక..చకా సాగుతున్న ఇళ్ల నిర్మాణం

గృహమస్తు!

సిద్ధమవుతున్న ఎన్‌టీఆర్ నగర్‌లు..

- ఇళ్ల నిర్మాణాల్లో కదలిక
- వేగంగా సాగుతున్న నిర్మాణపనులు
- ఫలించిన ప్రభుత్వ ప్రయోగం
- కదులుతున్న పేద జనం
- వెలుగుబందలో 3096 ఇళ్లు లక్ష్యం
- మే నెలాఖరుకు పూర్తిచేసే యోచన
- మరో 3 కాలనీల్లో ఆరంభమే లేదు
- ఇళ్లు మొదలైతే పాత విధానమే
- ఆరంభంకాకపోతే రెండు సెంట్లు
- పేదింటికి అధనంగా నిధులు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటికలను నెరవేర్చడానికి పనులు వేగవంతమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా కాలనీల అభివృద్ధి మాత్రం చేపట్టలేదు. జగన్ ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నానని చెప్పి ఏ కాలనీలోనూ కనీసం వంద ఇళ్లను నిర్మించలేకపోవడంతో ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఆ బాధ్యత తీసుకున్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత పేదలకు ఇచ్చిన ఒక్కో హామీని నెరవేరుస్తున్న సంగతి తెలిసిందే.దీనిలో భాగంగా పేదల కాలనీలకు ఎన్టీఆర్ కాలనీలు అని నామకరణం చేస్తూ ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. కానీ ఎక్కడా ఇంకా అధికారులు ఎన్టీఆర్ కాలనీ అని పేరు పెట్టకపోవడం గమనార్హం.

వెలుగుబందలో..

రాజానగరం మండలం వెలుగుబంద ఎన్టీఆర్ నగర్‌లో రాజమహేంద్రవరం పేదల కోసం 10,993 పట్టాలు ఇచ్చారు. 9,874 ఇళ్లను మంజూరు చేశారు. అందులో సుమారు 200 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. వంద ఇళ్లలో కాపురం ఉంటున్నారు. అనేక కారణాల వల్ల కొందరు పునాదులు వేయలేదు. మరికొందరు పునాదుల్లో నిలిపివేశారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మే నెల చివరకు ఈ నగర్‌లో 3096 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో కలెక్టర్ ప్రశాంతి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే 1882 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. అర్బన్ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతున్నారు. రోజుకు 19 ఇళ్లను నిర్మించాలనే లక్ష్యం పెట్టారు.ఇంకా 1214 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. కొందరు లబ్ధిదారులు మాత్రం బోర్లలో నీరు ఇంకిపోయిందని.. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీళ్లు అందక పనులకు ఆటంకం వస్తుందని చెబుతున్నారు. అధికారులు మాత్రం పనులు పూర్తి చేస్తా మంటున్నారు. సైట్‌లో ఉండి, ఇళ్ల నిర్మాణ లక్ష్యాలకు పనిచేస్తున్నామని హౌసింగ్ డీఈ కె.సూరిబాబు, ఏఈ కె.ఉమాశంకర్ తెలిపారు.

కానవరంలో కష్టాలు

రాజానగరం మండలం కానవరంలో గతంలో 1045 మందికి పట్టాలిచ్చారు. కానీ 808 ఇళ్లు మంజూరు చేశారు. ఇది రాజమహేంద్రవరానికి 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఫరిజెల్లపేటకు సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటుంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. విద్యుత్ సౌకర్యం లేదు. స్థంభాలు లేవు. నీటి సౌకర్యమూ లేదు. 102 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా 52 పూర్తి చేశారు.ఇక్కడ సౌకర్యాల్లేకపోవడంతో ఇప్పటి వరకూ అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

పల్లకడియంలో

గత సార్వత్రిక ఎన్నికల ముందు రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన 12,269 మందికి సెంటు చొప్పున హడావుడిగా వైసీపీ పట్టాలు పంపిణీ చేసింది.కానీ స్థలం చూపించ లేదు. లబ్ధిదారులు పల్లకడియం వెళ్లి ఆరా తీస్తే అవిగో ఆ పొలాల్లో స్థలాలకే మీకు పట్టలిచ్చారని చెప్పడంతో అందరూ ఉసూరుమంటూ తిరిగొ చ్చేస్తున్నారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం వీరి కష్టాలపై కూడా ఆరా తీసింది. వీరందరికీ అక్కడ సేకరించిన పొలాల్లో రెండేసి సెంట్ల వంతున పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది.ఈ మేరకు మునిసిపల్, హౌసింగ్, రెవెన్యూ అధికారులు పర్యటించారు. త్వరలో లేఅవుట్లు వేసి రెండేసి సెంట్ల వంతున విభజించి ఇళ్లను నిర్మించే యోచనలో ఉన్నారు.

వీరికే రెండేసి సెంట్లు

రాజమహేంద్రవరం అర్బన్ వెలుగుబంద కాలనీలో కొన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టడం వల్ల అక్కడ పాత పద్ధతిలోనే నిర్మాణాలు ఉంటాయి. కానీ అదనంగా ప్రభుత్వం రూ.75 వేల వరకూ సహా యం చేస్తోంది.కానవరం, పల్ల కడియం, బూరుగుపూడి, కాపవరం ప్రాంతాల్లో స్థలాలు చూపిం చకపోయినా పట్టాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రెండేసి సెంట్ల వం తున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించనుంది.

పేదింటికి అధనంగా..

స్థలం ఉన్నా ఇళ్లు కట్టుకోలేమని చెప్పిన వారికి అదనంగా కొంత డబ్బు ఇచ్చి ఇళ్ళను నిర్మిస్తోంది. యూనిట్ ఖరీదు గతంలో రూ.1.8 లక్షలు మాత్రమే. ఇవా ళ మరో రూ.50 వేలు అదనంగా ఇస్తోంది. అంటేయూనిట్ ఖరీదు రూ. 2.3లక్షలు అయింది. దీంతో కొందరు ముందుకు వస్తున్నారు. ప్రభు త్వం ఎంత ఇబ్బంది ఉన్నా ఇక్కడ పేదలకు ఇళ్ల ను నిర్మించాలనే లక్ష్యంతో ఉంది. దానికి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి కృషి తోడవుతోంది.

ఆవ..అంతేనా?

బూరుగుపూడి, కాపవరం ఆవలో గత ప్రభుత్వం 12,269 మందికి పట్టాలు ఇచ్చింది. కానీ స్థలాలు చూపించలేదు. కానీ ఆవలోనే లేఅవుట్ వేసినట్టు చెప్పింది. ఇది వర్షాకాలంలో బాగా లోయలా మారుతుండడంతో ప్రజలు, రాజకీయ నేతల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో కోర్టును ఆశ్రయించారు.ఇక్కడ పట్టాలపై కొత్త ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.ఆవలో మాత్రం ఇళ్లను నిర్మించదు.వేరే ప్రాంతాల్లో భూమి సేకరించి లబ్ధిదారుడికి రెండేసి సెంట్ల వంతున కేటాయించి,ఇళ్లు నిర్మించే నిర్ణయంతీసుకోవచ్చు.

ఆ కాలనీలకు వెళ్లలేం!

నాడు వైసీపీ ప్రభుత్వం ఊరికి దూరంగా శివారు ప్రాంతంలో స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇంటి నిర్మాణానికే ముందుకు రాలేదు. రాజమహేంద్రవరం నుంచి వెలుగుబంద కాలనీకి 18 కిలోమీటర్ల దూరం ఉంది. కానవరం అయితే 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాదాపుగా మిగిలిన కాలనీలది అదే పరిస్థితి.పేదలకు కాలనీ వద్దకు వచ్చి వెళ్లాలంటే కష్టమే. ఆటో కట్టించుకుంటే రూ.500 నుంచి రూ.800 డిమాండ్ చేస్తారు. వెలుగుబంద కాలనీకి అయితే దివాన్‌చెరువు సెంటర్ నుంచి డ్రాపింగ్‌కే రూ.150 తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో నలుగురో ఐదుగురో కలిసి ఆటో కట్టించుకుని వస్తున్నారు.ఈ ప్రాంతానికి ఓ ఆర్టీసీ బస్సు వేయాలని ప్రజలు కోరుతున్నారు. మంచినీటి కోసం ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేశారు. రెండు పూర్తయ్యాయి. మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. వాటికి వాటర్ కనెక్షన్ ఇవ్వవలసి ఉంది.అప్రోచ్ రోడ్డు వేశారు. విద్యుత్ సబ్-స్టేషన్ ఉంది. అన్ని వీధులకు విద్యుత్ ఉంది. కానీ డ్రైనేజీ లేదు.



ప..రేషన్!

నాలుగేళ్లుగా రేషన్‌కార్డులకు తప్పని నిరీక్షణ

కొత్త రేషన్‌కార్డులకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ ఆరంభిస్తుందా.. ఎప్పుడు దరఖాస్తు చేసుకుందామా అని నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభించ కపోవడంతో నిరాశ చెందారు. తొలుత సంక్రాంతికి కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్త లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త కార్డులు జారీ చేస్తే ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. మంత్రి నాదెండ్ల మేలో కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

- వైసీపీలో మూడేళ్లూ ఆ ఊసేలేదు
- ప్రస్తుత ప్రభుత్వంలోనూ జాప్యం
- అర్హులైన పేదల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో కార్డులకు క్యూ
- మే నెలలో ఇచ్చేందుకు ప్రణాళిక
- ఇప్పటికే 16.20 లక్షలు
- మరో 3 లక్షల దరఖాస్తులు
- తాజాగా కార్డులకు ఈకేవైసీ
- నెలాఖరు వరకూ గడువు పెంపు

సామర్లకోట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదు. నాడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి రెండేళ్లు రేషన్‌కార్డుల పేరిట బియ్యం కార్డులు మంజూరు చేసింది. తర్వాత మూడేళ్లలో ఒక్క కార్డూ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న చాలామంది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేశారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కొత్తకార్డులు ఇస్తామని గత డిసెంబరులో ప్రకటించారు. డిసెంబరు 2వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత అది పురోగతి లేకుండా పోయింది.

ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కొత్తకార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు సమర్పిస్తున్నారు. మూడేళ్లుగా రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇప్పుడు అనేక మంది అటు తహశీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిగా ఉన్నవారు కొత్తకార్డుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయాన్ని జిల్లా అధికారులు ప్రస్తావించారు.

బోగస్ ఏరివేతకే.. ఈకేవైసీ

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6,43,874 కార్డులు, కోనసీమ అంబేడ్కర్ జిల్లాలో 5,37,902 కార్డులు, తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 కార్డులు ఉన్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే నమోదు చేసుకున్న దరఖాస్తుల గణాంక సమాచారం ద్వారా తెలుస్తోంది. రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుంది. అందుకు ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీని చేపట్టింది. దీనివల్ల రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డు కలిగిన కుటుంబంలో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండడంతో అటువంటి వారి వేలిముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరితో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకున్నారు. నెలల తరబడి ఈ-పోస్‌లో వేలిముద్రలు వేయని వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. అధిక శాతం ఈకేవైసీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకూ పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.



మే నెల నుంచి కొత్తకార్డులు?

ఏటీఎం తరహాలో.. మంత్రి ప్రకటన..

ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్ షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ చేశారు. గ్రామాల్లో ఒక్కొక్క చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మునిసిపాలిటీల పరిధిలో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించారు. కానీ దీనిపై డీలర్లు కోర్టును ఆశ్రయించి తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలిపారు. దీంతో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డుల విభజన చేపట్టాలని న్యాయ స్థానం సూచించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త కార్డుల జారీ మొదలుకానుందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుత రేషన్‌కార్డు సైజు తగ్గించి ఏటీఎం కార్డు తరహాలో మే నెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని, క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు ఇస్తామన్నారు. అయితే కొత్త కార్డులు ఈసారైనా ఇస్తారో లేదో చూడాలి.

కొవ్వూరులో అద్వితీయం

పన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం

91.6 శాతం వసూలు

రాజమండ్రి రీజియన్‌లో ప్రథమం

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల వసూళ్లలో కొవ్వూరు మునిసిపాలిటీ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. కొవ్వూరు మునిసిపాలిటీలో ఇంటి పన్నులకు సంబంధించి డిమాండ్ రూ.3.60 కోట్లకు రూ. 3.30 కోట్లు వసూలు చేసి 91.60 శాతంతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం.. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.ఖాళీస్థలాల పన్నుల వసూళ్లలో డిమాండ్ 0.63 లక్షలకు రూ.25 లక్షలు, కుళాయి పన్నులకు సంబంధించి రూ. 133.92 లక్షలకు రూ.54.64 లక్షలు వసూలు చేశారన్నారు. ఆస్తి పన్నులకు సంబంధించి ఎరియర్ రూ.50 లక్షలు బకాయి ఉండగా రూ.40 లక్షలు వసూలు చేశామన్నారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు బకాయిలు చెల్లించని వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిడదవోలులో 5.92 కోట్లు వసూలు

నిడదవోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఇళ్లు, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు రూ.5,92,23,760లు వసూలైనట్టు నిడదవోలు మునిసిపల్ కమి షనర్ టి.కృష్ణవేణి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.4,61,11,332లు వసూలు కాగా ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్స రానికి రూ.5,92,23,760 వసూలు చేశామన్నారు. గతేడాదికంటే రూ.1,31,12,428లు అదనంగా పన్నులు వసూలు చేశామన్నారు. పట్టణంలోని పటిక ఫ్యాక్టరీ రూ.68 లక్షలు, నందిన స్టీల్స్ రూ.8 లక్షలు, నీటి పారుదల శాఖలకు చెందిన ప్రాపర్టీకి సంబంధించి రూ.65 లక్షలు, పోస్టాఫీసుకు సంబంధించి రూ.8 లక్షలు గత ఆరేళ్లగా బకాయిలు ఉన్నట్టు తెలిపారు.



దివాన్‌చెరువు హైవే పక్కన ఇల్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఫ్లయ్ ఓవర్‌కు రూట్ క్లియర్!

దివాన్‌చెరువు వద్ద నిర్మించనున్న ఫ్లయ్ ఓవర్‌కు హైవే అధికారులు రూట్ క్లియర్ చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దివాన్‌చెరువు జాతీయ రహదారి పక్కన ఉన్న పలు భవనాలు నేలమట్టం చేశారు. యజమానులకు ఆరేళ్లకిందటే పరిహారం అందజేసినట్టు సమాచారం.



హడావుడిగా కిరాణా దుకాణం సర్దేస్తున్న వ్యాపారి

అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సామాజిక పింఛన్లు

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం పట్టణం లోని 9వ వార్డు గౌతమీనగర్, ఎక్సైజ్ కార్యాలయం వీధి, ఇందిరమ్మ కాలనీ, అచ్చాయమ్మకాలనీలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో 3899 మందికి గాను 92.83 శాతం 3623 మందికి పంపిణీ చేసిన ట్టు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ తెలిపారు. అలాగే మండలంలోని 16 గ్రా మాల్లో 9991 మంది పింఛనుదారులుండగా 94.48 శాతం 9439 మందికి మొదటి రోజే పంపిణీ చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ, రాజాన శ్రీనివాస్, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, పాలూరి నీలిమ, మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పెనుమాక జయరాజు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, బొబ్బా అనిల్, తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

ఉండ్రాజవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 94 శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో వీవీఎస్ రామారావు మంగళవారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి సిబ్బంది అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. అంజనేయశర్మ, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే


నల్లజర్ల సీహెచ్‌సీలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నల్లజర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు అన్ని గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. మంగళవారం నల్లజర్ల పీహెచ్‌సీలో ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. తన సొంత ఖర్చులతో కూలర్‌ను డాక్టర్ గంగాధర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాను స్వయంగా కూలర్లు, ఏసీలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం అచ్చన్న పాపలెంలో నూతనంగా వచ్చిన పింఛన్‌లు అందించి పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, యద్దనపూడి బ్రహ్మారాజు, షేక్ మీరా, కండెపు వెంకటరత్నం, ఘంటా శ్రీను, యలమాటి శ్రీనివాస్,పాతూరి రమేష్, విడియాల శ్రీను, సవలం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ద్వారకా' అన్నదానానికి రూ.1,01,116 లక్షల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న డాక్టర్ బొడ్డు అనసూయ

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి కొవ్వూరు పట్టణానికి చెందిన డాక్టర్ బొడ్డు అనసూయ (సూర్యదేవర) రూ. 1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు సూర్యదేవర రంజిత్ కటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులకు విరాళాన్ని అందజేయగా, విరాళం బాండును అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్యదేవర రంజిత్, గీత, జాహ్నవి, సుహృత్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు కురాకుల బుజ్జి , తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


అర్బన్‌హెల్త్ సెంటర్లకు దాతల సహకారంతో సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్డు కం రైలు బ్రిడ్జి, క్రిస్టియన్‌పేట అర్బన్‌హెల్త్ సెంటర్లకు దాతల సహకారంతో సమకూర్చిన అవసరమైన సామగ్రిని ఆసుపత్రి వైద్యులకు అందజేశారు. రెండు అర్బన్‌హెల్త్ సెంటర్లకు సుమారు రూ. నాలుగు లక్షలు విలువ చేసే సామగ్రిని అందించిన దాతలను అభినందించారు. శివసాయి దామం కమిటీ సభ్యులు వాటర్ ప్యూరిఫైర్‌లు 2, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కుర్చీలు, టేబుల్స్, మున్సిపాల్టీ నుంచి బయోవేస్టు మెటీరియల్ క్యారేజ్ సివిల్ పనులు చేపట్టారు. ఆశోక్, కొడమంచిలి గీతలు ఎక్స్‌రే పనిముట్లు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మద్దిపాటి సత్యనారాయణ 2 ఫ్రిజ్‌లను, మరో దాత రెండు ఏసీలను బహూకరించారన్నారు. నల్లజర్ల, పోలవరం, దేవరపల్లి ప్రాంతాలలో ప్రమాదాలు జరిగితే రాజమహేంద్రవరం, అక్కడ నుంచి కాకినాడ తరలిస్తున్నారు. గోపాలపురం, నిడదవోలు, పోలవరం నియోజకవర్గాలకు కొవ్వూరు కేంద్రంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని సీఎం, డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరడం జరిగిందన్నారు. అంతేకాకుండా రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి మెడికల్ కాలేజ్‌గా మార్చు చేయడంతో కొవ్వూ రు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. 100 పడకల ఆసుపత్రికి సంబంధించి కొవ్వూరుకు చెందిన దర్శకులు రాజమౌళి తండ్రి రాజ్యసభ సభ్యుడు కోడూరి విజయేంద్రప్రసాద్ ఎంపీ నిధుల నుంచి ఆసుపత్రి అభివృద్ధికి రూ. 50 లక్షలు చేశారని, తొందరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భవనాలు కట్టారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. దాతలు ముందుకువచ్చి కళాశాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పేద ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పీ4 విధానాన్ని తీసుకువచ్చిందని గుర్తుచేశారు. కౌన్సిలర్ అక్షయపాత్ర రవీంద్ర మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం నుంచి సుమారు 34 మంది డయాలసిస్‌కు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాలకు సంబందించి కొ వ్వూరు ఆసుపత్రిలో డయాలిసిస్ విభాగాన్ని ఏర్పాటు చే యాల న్నారు. కొవ్వూరు సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ విభాగం ఏర్పాటుచేయడానికి రూ.లక్షఅందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, పాలూరి నీలిమ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, శివాసాయి దామం నిర్వాహకులు కసిరెడ్డి సీతారామయ్య, నగళ్ళపాటి శ్రీనివాస్, తాతయ్యబాబు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), పాకా శ్రీనివాస్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం వృద్ధాశ్రమంలో బుధవారం ఉదయం 11 గంటలకు విజయవాడకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు వైవీరావు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఇందులో గుండెకు సంబంధించి పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

చోడిపిండి, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యో) : వేసవిని దృష్టిలో పేద ప్రజలకు చోడి పిండి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. వేములూరు గ్రామానికి చెందిన గణపవరపు సత్యనారాయణ మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రజలకు వీటిని ఉచితంగా అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాడిమళ్ల విజయవాణి, టీడీపీ నేతలు బంటోతుల సురేష్, ఎల్ఐసీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పది' సోషల్ పరీక్షకు 22 మంది గైర్హాజరు

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలో మంగళవారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్షకు 22 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాల్లో 1235 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1213 మంది హాజరయ్యారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో 76 కి 70, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంట్ హైస్కూల్) 94 కి 92, ఏఎన్‌జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో 109 కి 109, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95కి 93, అభ్యాస పాఠశాలలో 130 కి 130, వేములూరు దీప్తి హైస్కూల్‌ల్లో 148 మందికి 143, భాష్యం పాఠశాలలో 144కి 139, జడ్పీహెచ్ఎస్, కుమారదేవంలో 118కి 118, జడ్పీహెచ్ఎస్, వాడపల్లిలో 213కి 212, జడ్పీహెచ్ఎస్, పంగిడిలో 108కి 107 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వడదెబ్బబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉండ్రాజవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బబారిన పడకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్. ఉషాదేవి పేర్కొన్నారు. చివటంలో మంగళవారం 104 కార్యక్రమంలో ఆమె పాల్గొని రోగులతో మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటివి తాగాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం


మాజీ కౌన్సిలర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కుటుంబసభ్యులు

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ కౌన్సిలర్ పాకా గోపాలకృష్ణ 9వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సత్యవతినగర్‌లోని మదర్ థెరిస్సా వీధి బాలల హోంలో కుటుంబసభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులోని విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), గ్రంధి శేషగిరి, పాకా శ్రీనివాస్, పి. చిన్నా, పి. సత్తిబాబు, పాకా శివకుమార్, పి. జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు : ఎమ్మెల్యే


గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఏసీలను బహూకరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

గోపాలపురం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): కారొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన మూడు ఏసీలను ఆయన ఆసు పత్రి సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో...

దేవరపల్లి : దేవరపల్లి పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో రోగుల మౌలిక సదుపాయాలలో భాగంగా ఎమ్మెల్యే సొంత నిధులతో కూలర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రు అనిల్, వైద్యులు సాంబశివరావు, సంజీవకుమార్, ఎంపీడీవో ఎస్. వేణుగోపాలరెడ్డి, టీడీపీ నేతలు కొయ్యలమూడి చిన్నబాబు, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, గద్దె సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, గద్దె రమాదేవి, మెంతిమి అమరావతి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ పద సంచలనం


కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

తాళ్లపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతవసంతంలోకి అడిగిడుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావ్ బలిరాం హెగ్డేవార్ జన్మదినం సందర్బంగా తాళ్లపూడిలో మంగళవారం పద సంచలనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపూడి, గోపాలపురం, పోలవరం మండలాల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, స్వయం సేవకులు పాల్గొన్నారు. ప్రధాన వక్తగా ఎస్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కర్రి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రాజమహేంద్రవరం జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యవాహ నారాయణరెడ్డి, మాణిక్యాలరావు, త్రిఖండ వాహ అనంతం సాయి, బొర్రా శ్రీరామ్మూర్తి, తాళ్లపూడి ఖండ వాహ అడ్డా శ్రీరామమోహన్ ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

5న డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

నిడదవోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సమిశ్రగూడెంలోని అరుంధతిపేటలో శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 9 అడుగుల నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్టు బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి రాజారత్నం మంగళవారం విలేకరులకు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ మనుమడు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారి కుమారుడు డాక్టర్ అన్షుల్ అభిజిత్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న గ్రీష్మకుమార్

నిడదవోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా... ఎన్నికల వాగ్దానాల మాట మరిచిందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. మంగళవారం శెట్టిపేటలో ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఖండవల్లి వీరవెంకటరావు, రావి వరహాలరావు, పాటంశెట్టి రాజేష్, మూర్తి, దిడ్ల నరేష్, దాసరి మురళి, ఎల్లే రాజారావు, సింహాచలం పాల్గొన్నారు.

యోగా గురువుకు నగదు ప్రోత్సాహం


నగదు ప్రోత్సాహం అందజేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మార్కొండపాడు శ్రీనిలయంలో సోమవారం రాత్రి జరిగిన ఉగాది వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హరే శ్రీనివాస కోలాట భజనతో పాటు చాగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల యోగా ప్రదర్శన కన్నుల విందుగా సాగింది. ప్రదర్శన ఇచ్చిన చిన్నారులతో పాటుగా శిక్షణ ఇచ్చిన గురువు గణేష్‌ను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెం కటేశ్వరరావు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేష్ అధ్యక్షుడు సుంకవల్లి రమేష్ యోగా గురువుకు రూ. పది వేలు నగదు ప్రోత్సాహాన్ని ప్రకటించి వేదిపై ఉన్న పెద్దల చేతులమీదుగా అందజేశారు. చక్కని కార్యక్రమాలు ఏర్పాటు చేసిన సుంకవల్లి ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్న చౌదరి, శేషకుమారిను ఈ సందర్బంగా పలువురు అభినందించారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

పేదల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

పెరవలి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల భద్రత, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దుర్గేష్ అన్నారు. ముక్కామలలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఆర్థికభారాన్ని సైతం లెక్కచేయకుండా వృద్ధులకు ఇచ్చే పెన్షన్ మూడు వేలు నుంచి నాలుగు వేలుకు పెంచిందన్నారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి కేవీకే రంగారావు డిమాండ్ చేశారు. దాళ్వా వరిపంట కోతలు మొదలై 10 రోజులు కావస్తున్నా ... ఇంతవరకు ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో రైతులు పచ్చి ధాన్యం బస్తా రూ. 1420కు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఆరుదల అయితే రేటు రూ. 1740 వరకు ఉంటుందన్నారు. ఈయనతోపాటు తదితరులు ఉన్నారు.

రైతు సేవా కేంద్రానికి ఇన్వర్టర్ బహూకరణ


సంగాయిగూడెం రైతు సేవా కేంద్రానికి ఇన్వర్టర్ బహూకరిస్తున్న దాత బ్రహ్మాజీ

దేవరపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాయిగూడెం రైతుసేవా కేంద్రానికి దాత పిన్నమనేని బ్రహ్మాజీ ఇన్వర్టర్‌ను బహూకరించారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ తన తండ్రి వెంకట రామారావు జ్ఞాపకార్థం అందిం చానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి వెంకట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

4న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

● గోడపత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : అమ రావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఈనెల 4న సెంట్రల్ జైలు రోడ్డులో ఆర్ట్స్ కాలేజి నుంచి జీజీహెచ్ వరకూ నిర్వహిస్తా మని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆమె మునిసిపల్ కమిషన్ కేతన్‌గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఎం.మల్లిఖార్జునరావుతో కలసి చిత్రకళా వీధి ప్రదర్శన గోడప్రతిని ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావడం కోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సుమారు 500 మందికి పైగా కళాకారులు వస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం లోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని వీధి ప్రదర్శన ద్వారా వచ్చేనిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రదర్శనలో భాగస్వామ్యం కోరుకునేవారు అమరావతి ఆర్ట్‌ఫెస్టివల్.కామ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు.

ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల రోడ్డులో అమరావతి వీధి ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎండలపై అప్రమత్తంగా ఉండాలి: తహశీల్దార్

గోపాలపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విపత్తుల శాఖ హెచ్చరికల మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని తహశీల్దార్ కే.అజయ్‌బాబు తెలిపారు.

నేడు ఓసీ, బీసీ కార్పొరేషన్ లోన్లకు ఇంటర్వ్యూలు

తాళ్లపూడి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓసీ, బీసీ కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీబీవీ రమణ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా అందించే సబ్సిడీ లోన్లకు 651 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరందరికీ మండల పరిషత్ కార్యాలయంలో 2వ తేదీన బ్యాంకర్లు, ఎంపీపీ, ఎంపీడీవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

నీటి తొట్టెల నిర్మాణం

తాళ్లపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటిఎద్దడిని ఎదుర్కొనేందుకు, పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి తొట్టెల నిర్మాణం చేపట్టినట్టు ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో రమాదేవి తెలిపారు. పశువులు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వీటిని నిర్మిస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా మలకపల్లి, అన్నదేవరపేటలోని పశువైద్యశాలల సమీపంలో నిర్మిస్తున్నామన్నారు. ఒక్కొక్క నీటి తొట్టికి రూ. 38 వేల నిర్మాణ వ్యయంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి, ఎన్‌జీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ చిత్రపటం ఆవిష్కరణ

తాళ్లపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి సొసైటీ బ్యాంక్‌లో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు కొమ్మురెడ్డి శ్రీనివాస్ సహకారంతో స్థానిక నాయకులు తిరుమలశెట్టి కృష్ణ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందికి మోదీ చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో గోకవరపు జితేంద్ర రవి, కలిశెట్టి సన్యాసినాయుడు, చెల్లింకుల రాధాకృష్ణ, నామా రంగనాయకులు, పామర్తి పవన్ కుమార్, భీమరాజు, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోపాలపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వాదాలకుంట పంచాయతీ పరిధి వెదుళ్లకుంట యాదవోలు మధ్యలో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ఏలూరు జిల్లా కొయ్యల గూడెం మండలం అంకాలగుడెంకి చెందిన బోడా పవన్‌కుమార్(20) వెదుళ్లకుంట గ్రామ శివారులో ఉన్న శ్రీ రేగులమ్మ వారి ఆలయం వద్ద జరిగే అన్నప్ర సాద కార్యక్రమానికి హాజరై.. తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హుటాహుటిన సామాజిక కేంద్రానికి తరలించారని తెలిపారు. దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే ముప్పిడి గ్రీవెన్స్

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా అర్జీల ద్వారా చెప్పొచ్చన్నారు.

ఆశాజనకంగా దాళ్వా వరి దిగుబడి


చాగల్లులో యంత్ర సహాయంతో కోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న వ్యవసాయ కూలీలు

చాగల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండ లంలో ప్రస్తుతం దాళ్వా వరికోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో సుమారు 8,200 ఎకరా ల్లో రైతులు వరిని సాగుచేశారు. 32 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని రైతులు, అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో దిగుబడి బాగుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరుదల ధాన్యం ఎకరాకు 50 నుంచి 55 బస్తాల వరకు వస్తుం దని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కూడా ఎకరాకు 90 సారాలు మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన సడలించి 130 సారల వరకు కొనుగోలు చేయాలని చిక్కాలకు చెందిన రైతుల పత్తిపాటి వీర్రాజు ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును వేదికపై కోరారు. ఈ విషయాన్ని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళతామని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఏవో కే. వేణు గోపాలకృష్ణ ఈవిషయమై వివరణ కోరగా, మండలంలో 14 రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. రెండురోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని ఆయన అన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

కొవ్వూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. గుంటూరు జిల్లా తేడపల్లికి చెందిన వీరగంధం శ్రీనివాసరావు తన భార్యతో కలిసి గతనెల 31వ తేదీన కాకినాడ నుంచి కారులో గుంటూరుకు బయటుదేరాడు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతింది. ఎవరికి గాయాలు కాలేదు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్‌పై కేసునమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.